లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

జూలై 2020 రూ.10/-



## అగ్రిప్రెన్యూర్స్:

# రైతులు వ్యవసాయాన్ని వ్యాపారంలా చేయాలి


Agricultural Supply Chains in India
FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS
www.fdrindia.org
A supply chain is an entire system of producing and delivering a product or service, from the very beginning stage of sourcing the raw materials to the final delivery of the product or service to end users
Shortcomings
Long and tenuous - 6-7 intermediaries
Regulatory hurdles - APMC Act and ECA
Lagging infrastructural development and low investments
Farmers realise only 33% of end value of produce
Consumers pay a steep price and face high price volatility
Solutions
Ease regulatory hurdles
Encourage private investments including 100% FDI in multi-brand retail to expand organised retail in India
Benefits
Significant increase in agriculture infrastructure and logistics
Massive employment including re-deployment of existing micro-entrepreneurs
Elimination of wastage
Fillip to food processing and value addition
Compression of market chain
Farmers' income will increase from the present 30-35% to 65-70% of end price
Reduce price volatility
Access to global markets

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

| సంపుటి | సంచిక | సంపాదకవర్గం | వర్కింగ్ ఎడిటర్ |
|---|---|---|---|
| 23 | 7 | బండారు రామ్మోహనరావు | దూసనపూడి |
| జూలై 2020 | | శిరమని నరేష్ | సోమసుందర్ |


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...

06 వ్యవసాయాన్ని రైతులు వ్యాపారంలా చేయాలి

17 రైతుల ఛాంపియన్‌ని ఏడిపించా!

20 సహకార సంస్థలకు ప్రోత్సాహం ఏది?

28 ప్రజలకు స్వావలంబన ఎందుకు?


కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్





చైనాలో లాగే ఇక్కడ కూడా ఏక పార్టీ పాలన తెస్తే సరి..

## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*



సంపాదకీయం

# భారత్ - చైనా పోటీ పడాల్సింది
# ఉన్మాదంలో కాదు..ఉత్పాదకతలో

భారత- చైనా సరిహద్దు వివాదం మరోసారి ఉద్రిక్తతలకు దారి తీసింది. వాస్తవాధీన రేఖను దాటి చైనా బలగాలు భారత భూభాగంలోకి చొచ్చుకు వచ్చాయి. గల్వాన్‌లోయ, పాంగాంగ్‌లోని నధూలా కనుమ, డార్‌చుక్ వంటి ప్రదేశాలలో చైనా తనస్థావరాలను ఏర్పాటు చేసుకునే క్రమంలో తాజా ఘర్షణలు జరిగాయి. జూన్ 15 రాత్రి జరిగిన కుమ్ములాటలో 20 మంది భారతీయ సైనికులు మరణించారు. తమ వైపు కూడా ప్రాణనష్టం జరిగిందని అంగీకరించిన చైనా సంఖ్యను మాత్రం వెల్లడించలేదు. ఉపగ్రహ ఛాయా చిత్రాలు, అంతర్జాతీయ మీడియా సమాచారం, సరిహద్దు ప్రాంతాల ప్రజాప్రతినిధులు, పదవీ విరమణ చేసిన సైనికాధికారులు చైనా చొరబాటును ధృవీకరించడం గమనార్హం. అయితే అఖిలపక్ష సమావేశంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ చొరబాటు జరగలేదని చెప్పారు.

భారత-చైనా సరిహద్దు వివాదం విషయంలో మధ్యవర్తిత్వం చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్సాహం ప్రదర్శించినా భారత్ స్పందించలేదు. రెండు దేశాల మధ్య వివాదంలో మూడో పక్షపు పాత్రని అంగీకరించడానికి ఉభయ దేశాల రాజకీయనాయకత్వం సంసిద్ధంగా లేవు. భారత్ -చైనా గరిష్ఠ సంయమనాన్ని పాటించాలని భద్రతాసమితి విజ్ఞప్తి చేసింది. ఇరుదేశాలు సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని రష్యా కోరింది. ఆసియా, పసిఫిక్‌లో అస్థిరత ఏర్పడటం అనర్థదాయకమని చాలా దేశాలు భావిస్తున్నాయి. చైనాపై వ్యూహాత్మక పోరాటానికి పథకాలు అమలు చేస్తున్న జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాలు సైతం భారత్-చైనా సరిహద్దు వివాదం యుద్ధానికి దారి తీయకూడదని భావిస్తున్నాయి. తాజా ఉద్రిక్తతలను ఉపశమింప చేయడానికి భారత-చైనా దేశాలు వివిధ స్థాయిల సంప్రదింపులను కొనసాగిస్తున్నాయి. సరిహద్దుల్లో సైనికాధికారులు దఫదఫాలుగా సుదీర్ఘ చర్చలు చేస్తున్నారు. దౌత్యాధికారులు రాత్రింబగళ్లు శ్రమిస్తున్నారు. విదేశాంగ మంత్రుల మధ్య కొనసాగుతున్న ప్రచ్ఛన్నయుద్ధంలో భారత్ ప్రవేశించడం తనకు ప్రతికూలంగా మారుతుందని చైనాకు తెలుసు. అలాగే చైనాతో ఎన్ని సమస్యలున్నా ప్రచ్ఛన్నయుద్ధంలో అమెరికాతో చేతులు కలిపి తన దీర్ఘకాలిక ప్రయోజనాలను నష్టపరచుకోవడానికి భారత్ సిద్ధంగా లేదు. యూరోపు మీద, అమెరికా మీద ఆధారపడకుండా ఆసియా , పసిఫిక్ ప్రాంతంలో ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించుకోవాలని భారత్ భావిస్తోంది. దీర్ఘకాలిక వ్యూహంతో భారత్ ఓపికగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడానికి కొంత సమయం పడుతుంది. ఈ లోగా సరిహద్దు వివాదాల పేరుతో ఘర్షణలకు, యుద్ధాలకు దిగడం భారత్‌కు శ్రేయస్కరం కాదు. అందులవల్లనే భారతీయ నాయకత్వం గతంలోనూ, ప్రస్తుతం కూడా సంయమనంతోనే వ్యవహరిస్తోంది.

చైనా తన ప్రయోజనాల కోసం భారత్‌ను ఇరుకులో పెట్టడానికి ప్రయత్నిస్తున్న మాట వాస్తవం. పాకిస్తాన్‌తో నెరుపుతున్న వ్యహాత్మక భాగస్వామ్యంకానీ, సరిహద్దుల్లో చొరబాట్లు, అంతర్జాతీయ వేదికలపై తీసుకుంటున్న భారత వ్యతిరేక వైఖరులు కానీ భవిష్యత్‌లో భారత్‌ను కట్టడి చేయడం కోసం మాత్రమే! భారత్ తనకు పోటీగా ఎదగగూడదని చైనా భావిస్తోంది. నిరంతర సంప్రదింపులు, ఇచ్చిపుచ్చుకునే ధోరణులు, పరస్పర విశ్వాసం, వ్యాపార వాణిజ్య బంధాలను బలోపేతం చేసుకోవడం, మూడవ పక్షపు ఉచ్చులో పడకుండా ఉండటం ద్వారా భారత్-చైనా సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోవడం సాధ్యమే! ప్రభుత్వాల స్థాయిలో అదే ప్రయత్నం కొనసాగుతోంది. అయితే మనదేశంలో 'దేశభక్తి' ఒక ఉన్మాదం స్థాయికి పెరిగిపోతోంది. దేశభక్తికి పేటెంటు తీసుకున్న ఆర్.ఎస్.ఎస్, బీజేపీ ప్రచార బృందాలు చైనాకు బుద్ధి చెప్పడానికి యుద్ధానికి సిద్ధం కావాలని రెచ్చగొడుతున్నాయి. నరేంద్రమోదీ విమర్శకులంతా చైనా చొరబాట్ల సమస్యని 'దేశభక్తి'రెచ్చగొట్టడానికి ఉపయోగిస్తున్నారు. విచిత్రంగా కాంగ్రెస్ పార్టీ సైతం 'దేశభక్తి' రాగాలాపన ప్రారంభించింది. జాతీయ దీర్ఘకాలిక వ్యూహాత్మక సమస్యలను రోజువారీ రాజకీయ ప్రచారాలకి వాడుకోవడంలో బీజేపీ వారిది అందెవేసిన చెయ్యి. ఆ విషయంలో వారిని కొట్టగలిగే వారెవరూ లేరు. కాంగ్రెస్ పార్టీ అనవసరంగా అటువంటి అనవసర సంవాదంలోకి దిగుతోంది. ఇలాంటి వ్యవహారాల్లో కిందబడినా పైచేయి నాదే అని దబాయించగల సత్తా బీజేపీకి ఉంది.


చైనాతో మనకున్న తాత్కాలిక సమస్యలను గానీ, దీర్ఘకాలిక వ్యూహాత్మక సమస్యలను గానీ సామాజిక మాధ్యమాలలో తొడకొట్టడం ద్వారా పరిష్కరించుకోలేమన్న నిజాన్ని కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు, మోదీ భక్తులు, మోదీ విమర్శకులూ గుర్తించాలి. ఉభయ దేశాల మధ్య వేలాది సంవత్సరాల చారిత్రక, సాంస్కృతిక అనుబంధం అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. సాంస్కృతిక, వైజ్ఞానిక, వ్యాపార, వాణిజ్య ఆదాన, ప్రదానాలు చిరకాలంగా ఉన్నాయి. సరిహద్దులో ఉన్న దేశంతో పోటీపడటానికి మనకు కావాల్సింది యుద్ధం కాదు. దేశభక్తి పేరుతో 'బాయ్‌కాట్ చైనా' నినాదాల వీరంగం వేస్తే సరిపోదు.

మన కంటి ముందు మనకంటే వేగంగా చైనా అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి గల కారణాలను మనం తెలుసుకోవాలి. చైనా జీడీపీ 13.6 ట్రిలియన్ డాలర్లు ఉండగా భారత్ జీడీపీ 2.7 ట్రిలియన్ డాలర్లు ఉంది. ఒకప్పుడు చైనావారి తలసరి ఆదాయం 1195 డాలర్లు కాగా, భారత్ తలసరి ఆదాయం 367 డాలర్లు ఉండేది. 2018 నాటికి చైనా తలసరి ఆదాయం 9,771 డాలర్లకు పెరగ్గా భారత్ 2000 డాలర్లకు పెరిగింది. ఒకప్పుడు చైనాలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు 66శాతం కాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 0.5 శాతం మాత్రమే. భారత్‌లో ఇప్పటికీ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు 28 శాతం ఉన్నారు. చైనాలో అక్షరాస్యత 97 శాతం కాగా భారత్‌లో అది 74 శాతంగా ఉంది. పట్టణాలలో నివసించే జనాభా చైనాలో 61.4 శాతం కాగా, భారత్‌లో 34.9 శాతం ఉంది. రైల్వే నెట్‌వర్క్ చూసుకుంటే చైనాలో 1,27,000 కిలోమీటర్లు రైలు మార్గాలుఉండగా, భారత్‌లో 68,446 కి.మీ. ఉన్నాయి. మానవాభివృద్ధి సూచికల్లో చైనా అనేక అంశాల్లో ముందుంది. అక్కడ ప్రజాస్వామ్యం, పారదర్శకత, లేని మాట నిజమే. కానీ ఒక జాతిగా వారికి పని సంస్కృతి, శ్రమ గౌరవం, సమయపాలన, క్రమశిక్షణ ఉన్నాయి. ఆ విషయంలో భారత్ ఎక్కడ ఉందో దేశభక్తులు చెప్పాలి. అన్ని రంగాల్లోనూ చైనాను అధిగమించడానికి మనం చేయాల్సింది యుద్ధం కాదు. మన జీడీపీని, ఉత్పాదక సామర్థ్యాన్ని, నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. కాంగ్రెస్ వారు స్వయం సమృద్ధి అన్నా, బీజేపీ వారు 'ఆత్మనిర్భరత' అన్నా అర్థం ఒకటే. మనం చైనాతో పోటీ పడాల్సింది విద్యలోనూ, వాణిజ్యంలోనూ, శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలలోనూ మాత్రమే. మిగిలిందంతా వాగాడంబరమే! దాన్ని ఎంత త్వరగా వదిలించుకుంటే దేశానికి అంత మంచిది.

డి. సోమ సుందర్

# వ్యవసాయాన్ని రైతులు వ్యాపారంలా చేయాలి

**-డా॥ జయప్రకాష్ నారాయణ్**



**మన దేశంలో కొవిడ్-19 లాక్‌డౌన్ సమయంలో ఆహార సరఫరాలో వైఫల్యం అటు రైతులను, ఇటు వినియోగదారులనూ నష్టపరిచింది. అందుకే కరోనా సంక్షోభాన్ని అధిగమించేందుకు చేపట్టే సంస్కరణల్లో వ్యవసాయ మార్కెటింగ్‌పై ఆంక్షల్ని తొలగించటానికి, రిటైల్ సప్లయ్ చెయిన్లను మెరుగుపరచటానికి ప్రాధాన్యత ఇవ్వాలని మోదీ ప్రభుత్వానికి జయప్రకాష్ నారాయణ్ సూచించారు. కొన్ని ఇతర రంగాలతోపాటు వ్యవసాయ రంగానికి సంబంధించి జేపీ ఇచ్చిన సూచనల్లో కొన్నిటిని మాత్రమే 'ఆత్మనిర్భర్ భారత్' ప్యాకేజీలో కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో.. వ్యవసాయ రంగంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న ప్రధానమైన మార్పులను స్థూలంగా తెలియచేసే ప్రయత్నమిది. ఇందుకోసం.. 'అన్నదాత' మాసపత్రిక స్వర్ణోత్సవ (2019-20) ప్రత్యేక సంచికకు ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ రాసిన వ్యాసాన్ని కొంత సంక్షిప్తీకరించి అందిస్తున్నాం..**

చైనీస్ సామెత చెప్పినట్లుగా మనం రైతులకి ఇవ్వాల్సింది దానం కాదు; పండించిన పంటకు మంచి రేటు, వారి కుటుంబాలకి మంచి ఆదాయం, ఖర్చు లేకుండా పిల్లలకి మంచి విద్య, ఆరోగ్యం, ఎదిగే అవకాశం.

కానీ మన ప్రభుత్వాలు మాత్రం చేయాల్సిన ఆ పనులు చేయకుండా.. 'ఇదిగో మేమిస్తున్నాం, దయదలిచి ఇస్తున్నాం, వీటిని ఇస్తున్నందుకు మీరు మాకు కృతజ్ఞులై ఉండాలి' అనే అనుత్పాదక పందేరాల రాజకీయాన్నే ఎక్కువగా కొనసాగిస్తున్నాయి. రైతుల్ని అవమానిస్తున్నాయి. ఢిల్లీ నుంచి గల్లీ దాకా కూడా. 'సొమ్ము ప్రజలదైతే, సోకు పాలకులది' ఎట్లవుతది? ప్రభుత్వాల దొంగ దానాల రాజకీయ సంస్కృతిని రైతులు ఎక్కడికక్కడ ప్రశ్నించాలి, మళ్లీ మళ్లీ తిప్పికొడుతుండాలి.. కానీ ఇదేసమయంలో సమాజం మాత్రం రైతుని 'దాత'గా గౌరవించుకోవటానికి, కర్షకురాలిని 'అన్నదాత' అనటానికి అభ్యంతర పెట్టనక్కర్లేదు.

ఈ దేశంలోని రైతులు తమ పంటల్ని ఇతరులకు అమ్ముకుంటున్నా కూడా.. తమ స్వేదంతో, త్యాగంతో పండించిన పంటల్ని, కష్టార్జితాన్ని ఇతర ప్రజానీకానికి తక్కువ ధరకే, కొన్ని సందర్భాల్లో నామమాత్రపు ధరకే, ఒక్కోసారి అది కూడా లేకుండానే అందిస్తున్నారు. కాబట్టే వారిని 'దాతలు' అంటే ఆక్షేపించనక్కర్లేదు. అన్నదాతా సుఖీభవ.. అన్న ఆశీర్వాదం మనకు ప్రత్యక్షంగా అన్నం పెట్టే వారికన్నా ముందు ఈ దేశంలోని రైతులకు దక్కాలి. అందుకే.. తెలుగు పత్రికారంగంలో అక్షర సేద్యానికి 'అన్నదాత' అనే పేరుతో జనాభాలో అత్యధికులు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని ఎంచుకున్నందుకు రామోజీరావుగారిని ఎంతైనా అభినందించాలి. వారి కృషి ఫలించి ఈ తొలి తెలుగు వ్యవసాయ మాసపత్రిక దేశంలోనే అత్యధిక సర్క్యులేషన్ గల వ్యవసాయ మాసపత్రికగా ఎదగటం, యాభై వసంతాల

మైలురాయిని చేరుకోవటం సగర్వంగా చెప్పుకోవాల్సిన విషయాలు. ఈ సందర్భంగా, అన్నదాత ప్రత్యేక సంచికను వ్యవసాయానికి దిక్సూచిగా ఉండే వ్యాసాల సమాహారంగా తేవాలనుకోవటం అభినందనీయం.

అన్నదాత పత్రిక ద్వారా రామోజీరావు గారు రైతులకు ఎప్పటికప్పుడు సాగు మెళకువల్ని, ఇతర విలువైన సమాచారాన్ని తెలియజేస్తూ ఎంతో మమకారంతో కృషి చేస్తున్నా.. మన పాలకులు మాత్రం అన్నదాత, రైతేరాజు వంటి పదాల్ని కేవలం రైతుల్ని ఎన్నికల్లో బోల్తాకొట్టించే బిరుదులుగా ఉపయోగిస్తున్నారనేది పచ్చివాస్తవం. ఆచరణలో వ్యవసాయాన్ని తీవ్రంగా నష్టపరిచే విధానాలను ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి.

వ్యవసాయాన్ని బాగు చేయటంలో అనేక అంశాలు ఇమిడి ఉన్నప్పటికీ.. చిట్టచివరికి తేలే సమస్య మాత్రం రైతుకు లాభసాటి ధర లభించకపోవటం! రైతుకి న్యాయమైన ధర వచ్చే ఏర్పాటు గనక చేయగలిగితే- వ్యవసాయంలోని మిగతా సమస్యలన్నీ ఒక కొలిక్కి వచ్చేస్తాయి. వ్యవసాయ రంగ పరిష్కారాలన్నిటినీ 'రైతుకు ఆదాయం పెంపు' చుట్టూ తిప్పితేనే మన దేశ వ్యవసాయ రంగంలో పునరుజ్జీవనం సాధ్యమవుతుంది. కేవలం రైతుకు ఆదాయం దక్కకుండా చేస్తున్న పాలకుల తప్పుడు విధానాల వల్లే.. ఈవేళ మన సాగు రంగం తీవ్రసంక్షోభంలో కూరుకుపోయి ఉంది.

## స్వతంత్రం వచ్చినప్పటి నుంచీ లేదు దార్శనికత!

దేశ జనాభాలో అత్యధికులు ఆధారపడిన రంగమే అయినా.. వ్యవసాయాన్ని బాగు చేయటానికి స్వతంత్ర భారత తొలి పాలకులే సరైన ప్రణాళికల్ని, దార్శనికతను ప్రదర్శించలేకపోయారు.

కుహనా సోషలిస్టు భావజాల ప్రభావంతో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సోవియెట్ యూనియన్ తరహాలో సమష్టి వ్యవసాయానికి మొగ్గు చూపినప్పుడు.. ఆచార్య ఎన్‌జీ రంగా వంటి వారు గట్టిగా అడ్డుకుని నిలువరించారు. రాజాజీ, మినూ మసానీ, రంగా, గౌతు లచ్చన్న వంటి వారు తమ కాలం కంటే ఎంతో ముందుచూపుతో ఆలోచించి రైతుల అభ్యున్నతి కోసం ప్రయత్నించారు. ఎటు చూసినా సోషలిజం, సమష్టి వ్యవసాయం వంటి విధానాలకు గుడ్డిగా మద్దతు లభిస్తున్న తరుణంలో కూడా వారు 'వ్యక్తి స్వేచ్ఛకు, ఆస్తి హక్కులకు, పోటీతత్వానికి, లాభాపేక్షకి' ఉన్న ప్రాధాన్యతను అర్థం చేసుకుని రైతుకు ఆదాయం కోసం ఆలోచించారు. ఆ తర్వాత మహారాష్ట్ర షేత్కారీ సంఘటన్‌కి చెందిన శరద్‌జోషి రైతుల ఆదాయానికి-స్వేచ్ఛా మార్కెట్‌కు గల సంబంధాన్ని అర్థం చేసుకుని ఉద్యమాల్ని నడిపారు. కానీ ఇప్పటికీ వారి ఆలోచనలు ఇంకా అమల్లోకి రాకపోవటం ఈ దేశ దురదృష్టం. దేశానికి స్వతంత్రం వచ్చిన తొలినాళ్ల నుంచి వ్యవసాయం పట్ల, పాఠశాల విద్య పట్ల, ఆరోగ్య రంగం పట్ల చూపిన నిర్లక్ష్యమే ఈవేళ జాతికి శాపాలుగా కొనసాగుతున్నాయి. ఈ మూడు రంగాలూ గనక సవ్యంగా ఉన్నట్టయితే.. వ్యవసాయం లాభసాటి అయి ఉండేది, విషయ పరిజ్ఞానంతో రైతులు సాగును విస్తరించుకోగలిగేవారు, ఆసక్తి ఉన్నవారు వ్యవసాయం నుంచి ఇతర రంగాల్లోకి వెళ్లి ఉపాధిని పొందగలిగేవారు, వ్యవసాయం మీద ఆధారపడేవారి సంఖ్య తగ్గి ఆదాయాలు పెరిగేవి, గ్రామాలకు-పట్టణాలకు మధ్య అంతరం తగ్గి దేశం సుస్థిర ఆర్థికాభివృద్ధిని సాధించగలిగేది, కుల వివక్షలు అదుపులోకి వచ్చి సామాజిక వికాసం వెల్లివిరిసేది.

వ్యవసాయంలో పాలకులు సరైన విధానాలను అనుసరించకపోగా, రైతులను పలు రకాలుగా దెబ్బతీసే విధానాలను అవలంబించారు. కులం, ప్రాంతం, భాష, పంట, పార్టీ పేరుతో విడిపోయి ఉన్న రైతులను రాజకీయ నాయకులు తమ ఓటు బ్యాంకు రాజకీయాల్లో తేలిగ్గా ఇముడ్చుకోగలిగారు. రైతు కుటుంబాల నుంచే వచ్చి రాజకీయాల్లో తొలిదశలో ఎంతోకొంత చిత్తశుద్ధితో ఉన్న నాయకులు కూడా విషవలయాన్ని ఛేదించలేకపోయారు. స్వతంత్ర పోరాటతరం నాయకులు పోయాక రైతులు ఎన్నికల రాజకీయ చట్రంలో మరింతగా కూరుకుపోయారు. ఆ కాలంలోనే దేశ ఆహారభద్రత సవాలును ఎదుర్కోవటానికి విధిలేని పరిస్థితుల్లో వ్యవసాయంలో ఆధునిక విధానాలను తీసుకొచ్చినా, హరితవిప్లవాన్ని అమలు చేసినా రైతులకి మాత్రం అన్యాయం జరుగుతూనే ఉంది. సి. సుబ్రహ్మణ్యం స్ఫూర్తిదాయక సారథ్యం, బి.ఎస్ శివరామన్ అకుంఠిత దీక్షాదక్షతలు, నార్మన్ బోర్లాగ్ నిర్దేశకత్వం, దేశవ్యాప్తంగా అసంఖ్యాక శాస్త్రవేత్తల అవిశ్రాంత కృషి కారణంగా హరిత విప్లవం వచ్చి దేశంలో ఆహారకొరత లేకుండా పోయింది, భారత్ మిగులు దేశమయింది. 1950లో దేశం మొత్తంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి కేవలం 5.3 కోట్ల టన్నులు మాత్రమే. ఇప్పుడది ఐదు రెట్లకి పైగా పెరిగింది. కానీ రైతు పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. భారతదేశంలో వ్యవసాయం నాశనమవటం ప్రకృతి శాపం వల్ల కాదు.. పాలకుల పాపం వల్లేనన్న వాస్తవాన్ని ప్రముఖ పత్రి 'ది ఎకనామిస్ట్' మే, 1991 సంచికలో రాసిన ప్రామాణిక వ్యాసంలో క్లయివ్ క్రూక్ ఇలా రాశారు: "భారతదేశ రాజకీయ నేతలు, విధాన నిర్ణేతలు, ప్రణాళికారూపకర్తలు అంతా కలసికట్టుగా కూర్చుని దేశ వ్యవసాయాన్ని నాశనం చెయ్యాలని కుట్ర పన్నినా, ఇప్పుడు చేసిన పనులనే చేసి ఉండేవారు!".

బంగారాన్ని తాకట్టు పెట్టాల్సిన పరిస్థితుల్లో విధిలేని పరిస్థితుల్లో పాలకులు దేశంలో ఆర్థిక సంస్కరణల్ని తీసుకొచ్చారు. ఆ సంస్కరణల్లో కూడా వ్యవసాయ రంగానికి విముక్తి లభించలేదు. పారిశ్రామిక రంగం విషయంలోలా వ్యవసాయాన్ని కూడా లైసెన్స్-పర్మిట్-కోటా నుంచి విముక్తి చేసే ప్రయత్నాన్ని పాలకులు చేయలేదు. దీంతో ఆర్థిక అంతరాలు పెరగటంతోపాటు వ్యవసాయ సంక్షోభం తీవ్రతరమవటం

మొదలైంది. 1955-56లో వ్యవసాయరంగంలో ఉన్నవారి తలసరి ఆదాయం రూ.195 మాత్రమేనని, అది వ్యవసాయేతర రంగాలలో ఉన్నవారి ఆదాయం (రూ.485)లో 40 శాతం మాత్రమేనని ఎన్జీ రంగా లెక్కకట్టినట్టు కిలారు పూర్ణచంద్రరావు ఉటంకించారు. పారిశ్రామిక రంగంలో సరళీకృత ఆర్థిక సంస్కరణల్ని అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని పాత చట్రంలోనే కొనసాగించటం మొదలయ్యాక ఆ ఆదాయపు అంతరం 6 రెట్లుకి పెరిగింది. ఈవేళ కూడా దేశ జనాభాలో 50 శాతం మంది జీవనోపాధికి వ్యవసాయం మీదే ఆధారపడుతున్నా మొత్తం స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో వారి వాటా కేవలం 17 శాతం లోపే ఉంది. ఈ వాటా ఏటా 0.5 శాతం చొప్పున తగ్గిపోతోంది. వ్యవసాయం మీద ఆధారపడిన జనాభా సంఖ్య మాత్రం అంత వేగంగా తగ్గకపోయినా కూడా.

## ప్రభుత్వాల ఘోర తప్పిదాలు ధరల రంగంలోనే ఎక్కువ

వ్యవసాయంలో ప్రభుత్వాల ఘోరమైన తప్పిదాలు ఉత్పత్తిరంగంలో కంటే ధరల రంగంలో ఉన్నాయి. మార్కెట్లలో వైపరీత్యాలు సృష్టించటం, ఉద్దేశపూర్వకంగా, నిర్లక్ష్య ధోరణితో ధరల్ని దెబ్బతీయటం, అవినీతిమయమైన లైసెన్స్-పర్మిట్-కోటా వ్యవస్థతో రైతుల్ని అణగదొక్కటాన్ని పాలకులు ఇంకా కొనసాగిస్తున్నారు. 1973లో ఆహారధాన్యాల హోల్‌సేల్ వాణిజ్యాన్ని కొద్దికాలం జాతీయీకరించారు. ఆ ప్రయోగం ఘోరంగా విఫలమైంది. దాంతో ఆ పని ఆపేశారు. కానీ రిటైల్ వ్యాపారాన్ని మాత్రం ప్రభుత్వాలు ఇంకా అత్యుత్సాహంతో నియంత్రిస్తూనే వస్తున్నాయి. నిల్వ, రవాణా, అమ్మకాలు ఇంకా రాజకీయ నేతల, అధికార యంత్రాంగం దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడి ఉన్నాయి. మనకున్న సమస్య పౌష్టికాహార లోపం అయినప్పటికీ, ఆహారభద్రత పేరుతో భారీస్థాయి అవినీతి, అసమర్థ ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ను నిర్వహిస్తున్నారు. దేశీయంగా ధరల్ని కృత్రిమంగా అణగదొక్కటంతో ప్రజాపంపిణీ వ్యవస్థలోని ఆహారధాన్యాలలో సుమారు 40 శాతం 'రీ సైకిల్' అయి తిరిగి గోదాములకు చేరుతున్నాయి లేదా మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఆహారధాన్యాల సేకరణను అధ్వాన్నంగా నిర్వహిస్తున్న ఎఫ్‌సీఐని నియంత్రించి ఆ బాధ్యతల్ని రాష్ట్రాలకు బదిలీ చేసి చేతులు దులుపుకోవాలని ప్రయత్నించటం కంటే ముందు.. వ్యవసాయ మార్కెట్ సంస్కరణల్ని అమలు చేయటం మీద కేంద్రం దృష్టి పెట్టాలి. దేశ జనాభాలో నిజమైన పేదలకు ఆహారం అందించాల్సిందే. కానీ ఆ పేరుతో దేశ జనాభాలో 70-80 శాతానికి రాయితీ ఆహారధాన్యాల్ని సరఫరా చేస్తే మార్కెట్ వైపరీత్యాలు, అవినీతి పెరిగి అంతిమంగా పేదరికం కొనసాగుతుంది, రైతులు కుంగిపోతుంటారు. ఆధార్ అనుసంధానంతోనే రూ.లక్ష కోట్ల రూపాయలను ఆదా చేయగలిగామని ప్రధాని మోదీ ప్రకటించలిగే అవకాశాన్ని మన తప్పుడు విధానాలే అందించాయి.

## 2011 ఉదంతం

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన ఆహారధాన్యాల ఉత్పత్తి మొత్తం 5.3 కోట్ల టన్నులు ఉంటే, 2010లో ఆహారధాన్యాల నిల్వలే 8 కోట్ల టన్నుల పైచిలుకు ఉన్నాయి. నిల్వ చేయటానికి గోదాములు లేకున్నా, ఎండకు, వానకు తడిసేలా ఎటువంటి ఆచ్ఛాదనా లేకుండా కూడా వాటిని అలాగే వదిలేశారు. పందికొక్కులు, ఎలుకలను పెంచి పోషించారు. అయినా ఎగుమతులని నిషేధించారు! దీనిపై 2011, ఏప్రిల్ 27 అప్పటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను కలిసి అన్ని వివరాలతో ఆయన్ని గట్టిగా ప్రశ్నించాను. తమ పంటలకు విదేశాల్లో ధర ఉన్నా కూడా మన రైతుల్ని అమ్ముకోనీయకుండా చేస్తూ, మరోపక్క కుళ్లిపోయేలా ఆహారధాన్యాల్ని నిల్వ చేయటం వ్యవసాయాన్ని, ఆర్థిక, సామాజిక రంగాల్ని సంక్షోభంలోకి నెడుతోందని వాదించాను. మన దేశీయ ఆహార భద్రతావసరాలకు కావలసినంత కనీస నిల్వను అట్టిపెట్టుకుని మిగతా ధాన్యాల్ని ఎగుమతులకు అనుమతించాలని కోరాను. ప్రధాని వద్ద ఈ విషయాలపై నా దగ్గర కంటే ఎక్కువ సమాచారం ఉంది. రైతుల తరపున గట్టిగా, సంఘటితంగా అడిగేవాళ్లు లేకపోవటం వల్లే ఆహారధాన్యాల ఎగుమతులపై నిషేధం కొనసాగుతున్నట్టు నాకర్థమైంది. ఆ పోరాటం ఫలితంగా ప్రభుత్వం స్పందించి ఎట్టకేలకు ఎగుమతులపై నిషేధాన్ని తొలగించారు. ఇదే పరిశ్రమలకు సంబంధించిన అంశమైతే, ఎప్పుడో తలుపులు బార్లా తెరిచి అమలు చేసి ఉండేవారు. అలా 2011 నాటి నుంచి ప్రతి సంవత్సరం బియ్యం ఎగుమతుల్లో ప్రపంచంలోనే మనదేశం అగ్రస్థానానికి చేరుకుని గణనీయ విదేశీ మారక ద్రవ్యాన్ని కూడా ఆర్జించింది. రైతులకూ రేటు కొంతవరకు పెరిగింది. ఆ తర్వాత వచ్చిన మోదీ ప్రభుత్వం ఇంతకుముందే చెప్పుకున్నట్టు.. ఎగుమతుల్ని ఆపలేదుగానీ, హేతుబద్ధమైన, స్థిరమైన ఎగుమతులు-దిగుమతుల విధానాన్ని అవలంబించకుండా రైతు వ్యతిరేక పద్ధతులకు అవకాశం కల్పించింది.

## మద్దతు ధర పెంపు వల్ల పరిమిత ఫలితం

హేతుబద్ధమైన, కచ్చితమైన ఆదాయాలు రైతు మనుగడకు, వ్యవసాయ పరిరక్షణకు అత్యంత ముఖ్యం. వ్యవసాయంలో ధరలు నిలకడగా ఉండవు కాబట్టి.. ఉత్పత్తుల ధరలు ఆ రిస్కును భర్తీ చేయాలి. రైతు కష్టానికి ప్రతిఫలం ఇవ్వాలి. ఇందుకు మార్కెట్‌కు నేరుగా అవకాశం కల్పించటం ముఖ్యం. మద్దతు ధర పాత్ర కేవలం పరిమితం.


రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పెంపు వల్ల కూడా రైతుల కష్టాలేమీ తీరవు. మద్దతు ధరను ఎంతో గొప్పగా అమలు చేశారనుకున్నా.. రైతుల కష్టానికి న్యాయమైన ఆదాయం లభించదు. కేవలం గోధుమ, వరి తప్ప ఇతర పంటలలో ప్రభుత్వ సేకరణ నామమాత్రమే.

రైతుల శ్రమను పూర్తిస్థాయిలో లెక్కించి లాభాన్ని కలిపి మద్దతు ధరను నిర్ణయించి కఠినంగా అన్ని పంటలకి అమలు చేయటం మన ఆర్థిక వ్యవస్థలో సాధ్యం కాదు. మిగతా రంగాల కంటే ఆహారోత్పత్తి చేసే వ్యవసాయ రంగం భిన్నమైనదే అయినా, రైతులకు ఒక పరిధి దాటి రాయితీల్ని ఇచ్చే స్తోమతు మన దేశంలోని మిగిలిన రంగాల పన్ను చెల్లింపుదారులకు లేదు. ఇదే జరిగితే ద్రవ్యోల్బణం పెరిగి కొత్త సంక్షోభం తలెత్తుతుంది. భారత్, చైనా, ఐరోపా సమాఖ్య విధించిన సుంకాలతో దెబ్బతిన్న అమెరికన్ రైతులను తక్షణం ఆదుకునేందుకు ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ రూ.80,000 కోట్ల దాకా రాయితీల్ని ప్రకటించారు. ఇంకా చాలా ఇస్తామని భరోసా ఇచ్చారు. ఇలా సగం కంటే ఎక్కువ జనాభాగా ఉన్న మన రైతులని ఆదుకునేంత ఆర్థిక సామర్థ్యం మన దేశానికి లేదు.

ఈ నేపథ్యంలో రైతులకు న్యాయమైన, లాభసాటి ధరలకు గ్యారంటీ ఇచ్చి గ్రామీణ పునరుజ్జీవనం, దేశ సమగ్ర ఆర్థిక ప్రగతి సాధించటానికి చేయవలసిందేమిటి?

## వాణిజ్య విధానాల నుంచి విద్య, ఆరోగ్యం వరకూ

న్యాయమైన ధరలకు భరోసా లేకపోవటం, దీర్ఘకాలిక కొరతలు వ్యవసాయ రంగంలో సంక్షోభాన్ని కొనసాగిస్తుంటాయి. ఇవి రెండూ ఆర్థిక వ్యవస్థకు అంతకంతకూ తీవ్రమైన సవాళ్లను విసురుతుంటాయి. నష్టాల ఊబి నుంచి వ్యవసాయాన్ని లాభాల బాట పట్టించటానికి మనం కొన్ని విభాగాలలో విధానాలను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాల్సి ఉంది. తొలుతే చెప్పుకున్నట్టు.. రైతుకు న్యాయమైన ఆదాయమే వీటన్నిటికీ కేంద్రబిందువు కావాలి. వాణిజ్య విధానాలు, గిడ్డంగులు, మార్కెట్ అవకాశం, విలువను జోడించటం, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ధరల పరిరక్షణ వంటి వాటన్నిటిలో మార్పులు తేవాలి.



వాణిజ్య విధానాల్లో భాగంగా ముందుగా ఎగుమతులు– దిగుమతుల విధానాన్నే తీసుకుంటే.. స్వల్పకాలికంగా గానీ, దీర్ఘకాలికంగా గానీ 'స్వేచ్ఛావాణిజ్యం' ద్వారానే సరకుల సరఫరా అవరోధాలు లేకుండా కచ్చితస్థాయిలో జరుగుతుందని మనకు శతాబ్ద కాలానికిపైగా ప్రపంచ చరిత్ర చెప్పిన పాఠం.

స్వల్పకాలికంగా చూస్తే, డిమాండ్, ధరలు ఎక్కడ ఎక్కువగా ఉంటే అక్కడికి సరఫరా ఉంటుంది. దీర్ఘకాలికంగా, మంచి ధరల ద్వారా అప్పటిదాకా సరఫరా తక్కువగా ఉన్న సరకు ఉత్పత్తిని పెంచేందుకు ప్రోత్సాహమిస్తుంది.

వ్యవసాయంలో సోవియెట్ యూనియన్ వైఫల్యం, స్వేచ్ఛావాణిజ్యం అమలు తర్వాత చైనా వ్యవసాయం సాధించిన విజయం– ఆర్థిక స్వేచ్ఛకున్న ప్రయోజనాల్ని రుజువు చేసే బలమైన సాక్ష్యాలు. కానీ మన ప్రభుత్వాలు హఠాత్తుగా ఎగుమతుల్ని నియంత్రించటం, మన వద్ద పంటలు బాగా పండినప్పుడు కూడా అవే ఉత్పత్తుల్ని పెద్దఎత్తున దిగుమతి చేసుకోవటం చేస్తున్నాయి. అసంబద్ధమైన, నిలకడలేని మన ఎగుమతులు– దిగుమతుల విధానం వల్ల రైతులు కూడా మెరుగైన ఆదాయాల కోసం గాలివాటంగా ఒక పంట నుంచి ఇంకో పంటకు వెంటవెంటనే మారుతున్నారు. దీనివల్ల వ్యవసాయం మరింత ఒడిదుడుకులకు లోనవుతోంది. ప్రపంచంలో ఎక్కడ మంచి ధర ఉంటే అక్కడ మన రైతులు తమ పంటల్ని స్వేచ్ఛగా అమ్ముకునే ఏర్పాటును పూర్తిస్థాయిలో, సుస్థిర విధానంగా చేస్తేనే రైతుకి మార్కెట్ అవకాశాలు పెరుగుతాయి. అంతర్రాష్ట్ర బియ్యం సరఫరాపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్ట విరుద్ధంగా అమలు చేస్తున్న ఆంక్షలకు వ్యతిరేకంగా 2012లో లోక్‌సత్తా, రైతుసంఘాల ఆధ్వర్యంలో కర్నూలు నుంచి కర్ణాటకకు, నాందేడ్ నుంచి మహారాష్ట్రకు బియ్యం మూటలతో నిర్వహించిన రైతు

సత్యాగ్రహ యాత్ర వల్ల.. తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమలోని రైతులకు ఒక్క బీపీటీ ధాన్యం వెరైటీలోనే ఒక్క సీజన్‌లోనే రూ.3,600 కోట్లదాకా అదనపు ఆదాయం వచ్చింది. కాబట్టి అరుదుగా వచ్చే ఆహారకొరతని తట్టుకోవటానికి వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేసుకుంటూనే.. దేశం లోపల, దేశ సరిహద్దుకు ఆవల ఆహారధాన్యాల వాణిజ్యంపై ఉన్న పరిమితుల్ని, నియంత్రణల్ని పూర్తిస్థాయిలో ఎత్తివేయాలి.

స్వేచ్ఛావాణిజ్యంలోనూ ఒడిదుడుకులుంటాయి. ఈమధ్య కాలంలో బియ్యానికి ప్రపంచవ్యాప్తంగా కొంత డిమాండ్ తగ్గింది. అలాగే పత్తి తదితర పంటల విషయంలోనూ సమస్యలు వస్తుంటాయి. దీనికి ప్రభుత్వం నుంచి విశ్వసనీయ మార్కెట్ సమాచారం రైతులకు ఎప్పటికప్పుడు అందుతుండాలి. ఏ పంట వేసుకుంటే ఎక్కువ లాభదాయకమో రైతులకు తెలియ జేస్తుండాలి. దిగుబడులకు ఏ రకమైన విత్తనాలు వేయాలో చెబుతుండాలి. జనం సొమ్ముతో జీతాలు తీసుకుంటూ పెత్తనం చేసేవాళ్లు తప్ప.. బాధ్యతలు తీసుకునేవాళ్లు కన్పించరు. వ్యవసాయ శాఖ యంత్రాంగం వైఫల్యం వల్ల నకిలీ విత్తనాలు, కల్తీ పురుగు మందులు ఇప్పటికీ అడ్డూ, ఆపు లేకుండా కొన సాగుతున్నాయి. ఈ తరహా వాతావరణంలో మన రైతులు ఆదా యాన్నిచ్చే పంటల్ని వేయటం చాలా కష్టసాధ్యమవుతుంది. ఇతర దేశాల ఆహారోత్పత్తుల దిగుమతులు, మార్కెట్‌లో అవకాశాలపై మన రైతులకు సమగ్ర సమాచారాన్ని అందించాలి. పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని, వనరులను కాపాడటానికి మెరుగైన ఆహారపు అలవాట్లపై ప్రచారాన్ని నిర్వహిస్తూ తదనుగుణమైన పంటలను ప్రోత్సహించాలి. నియంత్రణల ద్వారా కన్నా మార్కెటింగ్ ఇన్సెంటివ్‌ల ద్వారా సరైన పంటలకు సంబంధించి రైతులకు ప్రభుత్వాలు సంకేతాలనిస్తుండాలి.

తగినంత సరఫరా ఉన్న సమయాలలో న్యాయమైన వాణిజ్యం జరిగేటట్టు, మార్కెటింగ్‌కు మౌలిక సదుపాయాలు ఉండేటట్టు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని సమానావకాశాలతో కూడిన పోటీ నెలకొనేట్టు చూడాలి. ప్రభుత్వ సాయం అవసరం ఉన్న పేదలు బహిరంగ మార్కెట్‌లో ఆహారాన్ని కొనుగోలు చేసుకోవటానికి వీలుగా వారికి నగదు సాయం లేదా ఆహార స్టాంపులను అందించటం వల్ల ఎక్కువ లబ్ధి పొందగలుగుతారు.

మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉన్నప్పుడు రైతుకు అండగా నిలవటానికి ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి మద్దతు ఇవ్వాలి. నష్టపోకుండా ఆదుకోవాలి. పలు రాష్ట్రాల్లో చేస్తున్నట్టు అరకొర నిధులతో కాకుండా.. చెప్పుకోదగిన మొత్తంతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. రుణమాఫీ వంటి వాటికిచ్చే డబ్బును ఈ నిధికి కేటాయించాలి.

ఆహారధాన్యాలతోపాటు పత్తి వంటి ఆహారేతర ఉత్పత్తులకు సంబంధించి, ఇదే విధమైన దీర్ఘకాలిక, సరైన అంచనాలతో కూడిన విధానాన్ని చేపట్టటం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. అన్ని రకాల వాణిజ్య ఆంక్షల్ని తొలగించి భారత్‌లోని ధరల్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ధరలతో పోల్చి చూడాలి. తనకు మంచి ధర ఇచ్చేది విదేశీయులా, స్వదేశీయులా అన్నది రైతుకు ముఖ్యం కాదు. ఒక్కసారి ధరల స్థిరత్వం వచ్చాక మన రైతులు దీర్ఘకాలిక ప్రణాళికలతో వ్యవహరించగలుగుతారు. సామర్థ్యాన్ని ప్రదర్శించగలుగుతారు. మన వ్యవసాయం లాభసాటిగా మారి, ప్రభుత్వం కూడా కొంతమేర ఎరువుల సబ్సిడీ భారాన్ని తగ్గించుకోగలుగుతుంది. పంటల పోషకాలను హేతుబద్ధంగా వినియోగించే దిశగా చర్యలపై దృష్టి సారించగలుగుతుంది.

డిమాండ్, సరఫరా స్వేచ్ఛామార్కెట్‌లో కొనసాగే ఏర్పాటు వల్ల ధరలు నిలకడగా ఉంటాయి. ఒక్కసారి దీర్ఘకాలిక ధరలు స్థిరపడితే, వ్యవసాయంలోకి పెట్టుబడులు ప్రవహిస్తాయి. ఉత్పత్తి, ఉత్పాదకత రెండూ గణనీయంగా పెరుగుతాయి. ఉత్పాదకత పెరిగితే ధరలు నియంత్రణలో ఉంటాయి. మొత్తం ఆర్థికవ్యవస్థ దీర్ఘకాలంలో లాభపడుతుంది.

మరోవైపు, పామాయిల్, పప్పుదినుసులు వంటి దిగుమతులపై సుంకం విధించి ఆ డబ్బును మన రైతులకు ప్రోత్సాహకాలుగా ఇవ్వాలి.

## నిల్వ ఉండే పంటలు- మార్కెట్ యార్డుల ప్రక్షాళన- ప్లెడ్జి రుణాలు

నిల్వ ఉండే పంటలు కూడా ధరల విషయంలో ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రస్థాయి ఒడిదుడుకులకు లోనవుతూ అటు ఉత్పత్తిదారులను, ఇటు వినియోగదారులను నష్టపరుస్తున్నాయి. భారతదేశ వ్యవసాయ ఆత్మహత్యలలో ఎక్కువశాతం ఈ నిల్వ ఉండే పంటల రైతులవే. పత్తి, మిరప, పసుపు మూడు ఉదాహరణలు. ఇందుకోసం మార్కెట్లను పూర్తిగా ప్రజాస్వామీకరించి రైతుల ప్రత్యక్ష నియంత్రణలోకి తేవాలి. మార్కెట్ సెస్సు పేరుతో వందల కోట్లు వసూలు చేస్తున్నా, వాటితో రైతులకు కల్పిస్తున్న సదుపాయాలు పలుచోట్ల అధ్వాన్నంగా ఉన్నాయి. మార్కెట్ కమిటీలు పూర్తిగా ప్రభుత్వ చేతుల్లో ఉన్నాయి. వాటి నిర్వాహకుల్ని స్థానిక శాసనసభ్యుల ఇష్టాయిష్టాల మేరకు పార్టీల రాజకీయావసరాలకనుగుణంగా నియమించుకుంటున్నారు. పన్నులు చెల్లించే రైతులకు అనైతిక వ్యాపారుల నుంచి రక్షణ కల్పించటం లేదు. ఈ-నామ్ పద్ధతి ఇంకా నిలదొక్కుకోలేకపోవటానికి మార్కెట్ యార్డుల్లో అధికార రాజకీయం కూడా ఒక ప్రధాన కారణం. మార్కెట్లను రైతు కమిటీల పరిధిలోకి తెచ్చి గిడ్డంగులు, ఇతర మౌలిక వసతుల్ని అభివృద్ధి చేసేలా చేయాలి. దిగుబడి వచ్చే సమయంలో మార్కెట్లో సరైన ధర లేకుంటే.. తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుని ఆ తనఖాతో ప్లెడ్జి రుణాలు తీసుకునే అవకాశాన్ని రైతులకు కల్పించాలి. తర్వాత తమకు నచ్చిన ధర వచ్చాక అమ్ముకుంటారు. దీనివల్ల మార్కెట్ దోపిడీకి గురికాకుండా.. మార్కెట్ అందించే అవకాశాల్ని అందుకోగలుగుతారు. ఏపీలో

రాష్ట్రవ్యాప్తంగా 80లక్షలకు పైగా రైతులు వ్యవసాయం చేస్తుంటే రైతుబంధు పథకం ద్వారా రుణం పొందుతున్నవారు 3,500లోపే. ధర పలకనప్పుడు నిలవ చేసుకునే అవకాశం, ప్లెడ్జి రుణాల ద్వారా కుటుంబానికి, పంటకి కావలసిన డబ్బు అందించటం – ఈ రెండూ అందితే, రైతులు గతిలేక అయినకాడికి అమ్ముకుని నష్టపోరు; మళ్లీ ధర పెరిగే దాకా నిలవ ఉంచుకుని ఆదాయాన్ని పెంచుకోగలరు.

## రవాణాతో అనుసంధానమైన అధునాతన శీతల గిడ్డంగులు

ఇక ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా కుళ్లిపోయే టమాటా వంటి పంటల విషయంలో సమస్యల్ని అధిగమించటం వ్యవసాయ మార్కెట్‌కు పెద్దసవాలుగానే చెప్పుకోవాలి. మనదేశంలో ఇలాంటి శీతల గిడ్డంగుల సదుపాయాలు తగినంత లేకపోవటం, అధిక సరఫరా వల్ల 35 శాతం పండ్లు, కూరగాయలు వృధా అవుతున్నాయి. 1997 నుంచి 2007 మధ్య కాలంలో దేశంలో ఏటా 2.20 లక్షల టన్నుల పండ్లు వృధా అయ్యాయి. 2007 తర్వాత ఈ వృధా ఇంకా పెరుగుతూ భారత్‌లో ఏటా రూ.13,300 కోట్ల విలువైన తాజా పండ్లు, కూరగాయలు వృధా అవుతున్నట్టు ఓ అంచనా. దేశంలో సుమారు మూడు కోట్ల 11 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార పదార్థాలను నిల్వ చేయగల 6,300 శీతల గిడ్డంగులున్నాయి. వీటిలో చాలా గిడ్డంగులు ఆహారోత్పత్తి కేంద్రాలకు దూరంగా ఉన్నాయి.

శీతల గిడ్డంగుల్లో ఉంచిన టమాటాలు కూడా మరీ ఎక్కువకాలం నిల్వ ఉండటం లేదని సురాజ్య యాత్రలో మదనపల్లె రైతులు నాకు చెప్పారు. కాబట్టి అభివృద్ధి చెందిన, చెందుతున్న చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలలో ఏర్పాటు చేసినట్టు.. మంచి రవాణా వ్యవస్థను, నాణ్యమైన శీతల నిల్వ సదుపాయాలను ఏర్పాటు చేయాలి. వీటితోపాటు.. వృధాని అరికట్టి వ్యవసాయోత్పత్తులకు అదనపు విలువను జోడించటానికి, పారిశ్రామికీకరణను ప్రోత్సహించటానికి, ఉపాధి అవకాశాలను కల్పించటానికి చాలా పెద్దస్థాయిలో ప్రాసెసింగ్‌ను పెంపొందించాలి. దీనివల్ల రైతుల వద్ద పొలం నుంచి నేరుగా సేకరించే ధరల్ని కూడా పెంచవచ్చు. వ్యవసాయంలో పెట్టుబడులంటే సాగునీటి ప్రాజెక్టులు, రుణమాఫీలు, తాత్కాలిక తాయిలాలు అనే సాంప్రదాయ ధోరణి మారి.. గ్రామీణ ప్రాంతానికి రహదారులు, నిల్వ సదుపాయాలు, రిటైల్ మార్కెట్ సదుపాయాలు, పరిశోధన వంటి వాటిల్లోకి నిధులు మళ్లించాలి. ఇందుకోసం స్వదేశీ, విదేశీ అనే తేడా లేకుండా ప్రైవేటు ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించాలి.

## దళారీలు లేకుండా పెద్ద ఎత్తున రిటైల్ చెయిన్లు

ఉత్పత్తిదారునికి, వినియోగదారునికి మధ్య పలు అంచెల గొలుసుకట్టు దళారీ వ్యవస్థ ఉండటం వల్ల.. కొనుగోలుదారులు చెల్లించే డబ్బులో చాలా తక్కువ శాతం మాత్రమే రైతుకు దక్కుతోంది. మరోపక్క వినియోగదారుడు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేయడం మినహా గత్యంతరం లేకపోతోంది. మార్కెట్లో దళారీలను నియంత్రించగలిగితే రైతులకు, వినియోగదారులకు కూడా లాభం వస్తుందని రైతుబజార్లు వంటి పరిమిత ప్రయోగాల్లో కూడా రుజువవుతోంది. ప్రస్తుతం చాలా పంటల్లో 20–35 శాతమే రైతుకు ఆదాయంగా వస్తోంది. రిటైల్ చెయిన్లను కూడా ప్రోత్సహిస్తే, వినియోగదారులు చెల్లించే మొత్తంలో 70శాతం రైతులకు దక్కుతుంది.

కొన్ని పంటలకు కనీస ధర పెంచుతూ 2018లో కేంద్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేసిన మూడు రోజులకే 36 దేశాలు సభ్యులుగా ఉన్న ప్రపంచ ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) నివేదిక వెలువడింది. ఆ నివేదిక భారతదేశంలో వ్యవసాయ సంబంధిత విధానాలను సమీక్షిస్తూ, “ఇండియాలో రైతులు ప్రధాన వ్యవసాయ సబ్సిడీల వల్ల ఎక్కువ ప్రయోజనాలు పొందుతున్నారనే అభిప్రాయం చాలామందిలో ఉంది. కానీ, నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక 2014 నుంచి 2016 దాకా అనుసరించిన విధానాల నిర్ణయాల మూలంగా రైతులకు అందిన ఆదాయాలు ఏటా సగటున ఆరు శాతం చొప్పున తరిగిపోతూ వచ్చాయి. అదే సమయంలో ప్రభుత్వ విధానాల వల్ల రైతులకు దక్కాల్సిన శ్రమ ఫలితంలో ఆ పంటను అనుభవించే వినియోగదారుల నుంచి 25 శాతం తక్కువ ఆదాయం లభిస్తోంది!” అని పేర్కొంది.

రిటైల్ చెయిన్ల వల్ల ధరల ఒడిదుడుకులు తగ్గుతాయి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, మన బలాల్ని సద్వినియోగం చేసుకుని ప్రపంచ మార్కెట్‌లో పోటీపడగలుగుతాం.

మౌలికసదుపాయాల్ని మెరుగుపరిచేందుకు అందుబాటులో ఉన్న ప్రతి వనరునూ ప్రభుత్వం వినియోగించాలి. మనదేశంలో రిటైల్ వ్యాపారం ఏటా 13 శాతం మేర పెరుగుతోందని అంచనా. గ్రేడింగ్, కాంట్రాక్ట్ వ్యవసాయం, ప్యాకేజింగ్, పెట్టుబడి సాయం, అవసరమైన ఇతర తోడ్పాటుల ద్వారా వ్యవసాయోత్పత్తుల నాణ్యత పెంచేందుకు వ్యవస్థీకృత రిటైల్ పరిశ్రమ అవసరం. పెద్ద ఎత్తున ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)తో రిటైల్ చెయిన్ల వల్ల రైతులకు నేరుగా మార్కెట్ అవకాశం అందుబాటులోకి వస్తుంది. వ్యవసాయ ఆదాయాలు మెరుగుపడి నాణ్యతాప్రమాణాలు పెరగటం వల్ల మన రైతులు ప్రపంచమార్కెట్లలో కొత్త అవకాశాలను కూడా అందుకోగలుగుతారు. సంఘటిత రంగంలో ఉద్యోగావకాశాలూ పెద్దసంఖ్యలో పెరుగుతాయి.

## మాంసం, చేపలు, పాలు - సహకార సంఘాలు - 97వ రాజ్యాంగ సవరణ

2050 నాటికి కూడా మన దేశ ఆహారావసరాలకు ఇప్పుడు చేస్తున్న ఉత్పత్తి స్థాయిలో సాధారణ పెంపుదల ఉంటే సరిపోతుందనే అంచనాలున్నాయి. మన జనాభా వృద్ధి రేటు 1 శాతమే ఉంటే, సంప్రదాయ ఆహారోత్పత్తుల్ని భారీగా పెంచనక్కర్లేదు. కానీ వ్యవసాయం వ్యాపారంలా జరిగి రైతుకి లాభం చేకూరాలంటే మాత్రం, ప్రపంచ మార్కెట్‌లోని డిమాండ్-సప్లయ్ పరిస్థితుల్ని కూడా దృష్టిలో పెట్టుకుని ఉత్పాదక పెంపు ప్రణాళికలు వేసుకోవాలి.

మనదేశంలో ఆహారధాన్యాల వినియోగం తగ్గినా పళ్లు, కూరగాయలు, మాంసం, చేపలు, పాలు, గుడ్లు వంటి వాటి వినియోగం పెరుగుతోంది. ప్రస్తుతం మన దేశంలో తలసరి 160 కిలోల ఆహారధాన్యాలను వాడుతున్నారు. 2050 నాటికి తలసరి వినియోగం ఇంకా తగ్గవచ్చని నిపుణుల అభిప్రాయం. ఆదాయం పెరగటంతో, ఆహార అలవాట్లు మారతాయ్ఌ్మ అన్నం తక్కువ తిని, కూరలు, పళ్లు, పాలు, గుడ్లు, మాంసం ఎక్కువ తినటం జరుగుతుంది. రాబోయే 30 ఏళ్లలో మాంసం గిరాకీ మాత్రం 50 శాతానికిపైగా పెరిగే అవకాశముంది. కాబట్టి వ్యవసాయంలోనే కాకుండా.. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పరపతి, మార్కెటింగ్‌లకు సహకార సంఘాల వ్యవస్థను పటిష్టంగా పెంపొందించటం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యరంగంలో ఉన్న వృద్ధిని కలపటం వల్లే వ్యవసాయంలో వేగంగా వృద్ధి రేటు కనిపిస్తోంది. ఏపీ, తెలంగాణల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా చేపల పరిశ్రమ అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

వర్గీస్ కురియన్ చొరవతో అమూల్.. పాడి సహకార రంగంలో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయాలన్నిటిలోనూ చిన్న రైతులే భాగస్వాములు. లాభాల్లో 75 శాతానికిపైగా ఆ చిన్నవాటాదారులకే అందుతాయి. ఒకప్పుడు పాలకొరతతో బాధపడిన భారతదేశం 1998లో అమెరికాను సైతం వెనక్కునెట్టి ప్రపంచంలోనే అతి పెద్ద పాల ఉత్పత్తిదారుగా అవతరించిందంటే.. దాని వెనుక అమూల్ స్ఫూర్తే కారణం. అమూల్ స్ఫూర్తితోనే తెలుగునాట 1995లో వచ్చిన 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంస్థల) చట్టంతో ఏర్పడిన పాడి సహకార సంస్థలను దెబ్బతీయటానికి తెలుగునాట ప్రభుత్వాలు ఎన్నో ప్రయత్నాలు చేశాయి, ఇప్పటికీ దెబ్బకొట్టేందుకు అవకాశం కోసం చూస్తున్నాయి. న్యాయస్థానాల్ని ఆశ్రయించటం సహా పలుపోరాటాల ద్వారా వాటిని నిలువరించగలిగాం. చివరికి లోక్‌సత్తా కృషితోనే సహకార సంస్థలకు స్వతంత్ర ప్రతిపత్తిని గ్యారంటీ చేసే 97వ రాజ్యాంగ సవరణ వచ్చింది. ఈ పోరాటాల ఫలాలు దీర్ఘకాలం మనగలిగి రైతులకు ఫలితాలనివ్వాలంటే 3 ఏర్పాట్లు అవసరం.

1) 97వ రాజ్యాంగ సవరణ కేవలం కాగితాలకే పరిమితం కాకుండా.. అన్ని చట్టాల్ని, ప్రభుత్వాల నిబంధనల్ని ఆ రీతిలో, ఆ స్ఫూర్తికనుగుణంగా రూపొందించాలి.

2) న్యాయస్థానాలు, పౌరసమాజం, మీడియా.. పౌరులకి- ప్రభుత్వానికి మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మనం రాచరికంలో లేమని, ఇతరులకు ఇబ్బంది లేనంతవరకు పౌరులు సొంతంగానూ, ఉమ్మడిగానూ చేపట్టే ఏ కార్యక్రమాన్నయినా శాసించే అధికారం ప్రభుత్వాలకు లేదని, ప్రభుత్వం మన ఓటుతో ఎన్నికై మన కోసం పనిచేసే సంస్థ తప్ప మనందరి మీదా అన్ని విషయాల్లో పెత్తనం చేసే అధికారం దానికి లేదని మనందరం గుర్తించాలి.

3) అన్నింటినీ మించి ఈ సహకారరంగంలో అంతర్గతంగా నిజాయతీ, సామర్థ్యం, విశ్వసనీయత ఉన్న బలమైన నాయకత్వం నిరంతరం పెరగాలి. ఎల్లకాలం ఒక విశ్వనాథ రెడ్డి (ముల్కనూరు), ఓ జానకిరామయ్య (కృష్ణా డెయిరీ), ఓ తులసీరావు (విశాఖ డెయిరీ), ఓ రాజేశ్వరరావు (కరీంనగర్ డెయిరీ) మీద ఆధారపడితే, కొత్త నాయకత్వాన్ని నిరంతరం ఉత్పత్తి చేసే వాతావరణం లేకపోతే, అంతా ప్రభుత్వ పెత్తనమే అవుతుంది. ప్రజాస్వామ్యం హరించుకుపోతుంది. జాతీయ, అంతర్జాతీయ బడా కార్పొరేట్ సంస్థలు తప్ప చిన్న వ్యాపారులు, ఉత్పత్తిదారులు, సంస్థలు సొంతంగా నిలదొక్కుకునే అవకాశం ఉండదు.

రాజకీయ పార్టీలు, మీడియా, సహకార సంస్థల నాయకులు- ఈ మూడు వర్గాలూ అటు సమాజ ప్రయోజనాల్ని, ఇటు రాజ్యాంగ హక్కుల్ని, సంస్థల్లో ఉన్న వారి ప్రయోజనాల్ని కాపాడటం కోసం.. వీలైనంతగా అధికారం రైతులకు, వినియోగదారులకు అతి చేరువగా, వారికి జవాబుదారీగా ఉండేలా నిరంతరం వారధిగా పనిచేయాలి.

అమెరికాలాంటి దేశాలుగానీ, ఐరోపాలో నెదర్లాండ్స్‌లాంటి దేశంలోగానీ ఇప్పటికీ వ్యవసాయ, డెయిరీ రంగాల్లో పౌరుల ఆధ్వర్యంలోని సహకార సంఘాలదే కీలక పాత్ర!

## పరిశోధనలకు పెద్దపీట

హరిత విప్లవ సమయంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో కలిసి ఐసీఏఆర్ ప్రశంసనీయ కృషి చేసింది. కానీ ఇటీవలి కాలంలో వ్యవసాయ పరిశోధనలో చాలా విశ్వవిద్యాలయాలు చరమదశకు చేరుకున్నాయి. ఆహార భద్రతకు, రైతుల ఆదాయాలకు గ్యారంటీ ఇవ్వడానికి కీలకమైన పరిశోధనలకు నిధుల కేటాయింపును, నాణ్యమైన శాస్త్రవేత్తలను మన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాలలో, జన్యుమార్పిడితో మెరుగైన వంగడాల తయారీలో, తెగుళ్ల నియంత్రణ, భూసార నిర్వహణ, కరవును తట్టుకోవడం, దిగుబడి, అనంతర సాంకేతిక పరిజ్ఞానం, జీవ సాంకేతిక పరిజ్ఞానంలోని నూతన అంశాలపై గణనీయ పెట్టుబడులు అవసరం. మన రైతులకు, పరిశ్రమలకు అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానం కావాలి. లేకుంటే,

గుత్తాధిపత్యాలు, బహుళ జాతి సంస్థలు మనల్ని నిర్దాక్షిణ్యంగా దోచేస్తాయి. ఒకే పంటపై ఒకే తరహాలో చేసే మూస పద్ధతులను ఆపేసి ఆధునిక అవసరాలకనుగుణంగా పరిశోధనల్ని చేయాలి. జాతీయ వ్యవసాయ పరిశోధనా ప్రాజెక్టులను 'ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం' (పీపీపీ) విధానంలో చేపట్టాలి.

## వ్యర్థాల సద్వినియోగం

మన వ్యవసాయోత్పత్తుల్లో ఏటా సుమారు 330 మిలియన్ టన్నుల వ్యర్థాలు ఉంటాయి. అందులో దాదాపు సగం రైతులు వివిధ రూపాలలో ఉపయోగించుకోగా, మిగిలిందంతా తగలబెట్టేస్తున్నారు. దాంతో విలువయిన సేంద్రియ పదార్థం వృథా అవుతోంద్మి ఆపైన వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. దాన్నే సద్వినియోగం చేస్తే ఆదాయం పెరుగుతుంద్మి కాలుష్యం తగ్గుతుంది. ఈ వ్యవసాయ వ్యర్థపదార్థాలని సద్వినియోగం చేసి అటు పారిశ్రామిక, ఉపాధి రంగాల్ని, ఇటు రైతుల జీవితాల్ని మెరుగుపరిచే విధంగా ఉపయోగించాలి. అందుకు కాంపాలాంటి నిధులు ప్రభుత్వం దగ్గర పుష్కలంగా ఉన్నాయి, కానీ వాటిని సద్వినియోగం చెయ్యటం లేదు.

## రైతుకి భద్రతతో కూడిన భూ టైటిల్‌ను అందించాలి

భూ తగాదాల వల్ల ఏటా కోల్పోతున్న జాతీయాదాయం జీడీపీలో 1.3శాతం కాగా, భూ వివాదాల్లో ఉన్న వ్యక్తులు కోర్టు వాయిదాలకు హాజరుకావడానికి చేస్తున్న వ్యయం రూ.15,000 కోట్లు అని ఇటీవల నిపుణులు తేల్చారు. భూమిపై సరైన హక్కు పత్రాలు లేకపోవడం వల్ల ఎకరానికి రైతు రూ.60వేల నుంచి లక్ష వరకు (రాయితీలు, వగైరాల రూపంలో) లబ్ధి కోల్పోతున్నట్టు అంచనా. భూముల సర్వేను పకడ్బందీగా పూర్తి చేసి డిజిటలైజ్ చేయటంతోపాటు టైటిల్‌పై రైతులకు పూర్తి భద్రతతో కూడిన హక్కును కల్పించాలి.

## భూ సీలింగ్ చట్టాలు - పెట్టుబడులు

ఇక్కడే భూకమతాల గురించి చెప్పుకోవాలి. నేను సురాజ్య యాత్ర చేసిన ఆంధ్రప్రదేశ్‌నే తీసుకుంటే.. రాష్ట్రంలో భూకమతాల సరాసరి పరిమాణం తగ్గిపోతోంది. 2005-06లో ఉన్న 1.13 హెక్టార్ల నుంచి 2010-11లో 1.06 హెక్టార్లకు తగ్గిపోయింది. ప్రస్తుతమున్న కౌలుచట్టాలు, భూ గరిష్ట పరిమితి (సీలింగ్) చట్టాలు కార్పొరేట్ పెట్టుబడులకు, పెద్దఎత్తున వ్యవసాయ నిర్వహణకు అవరోధాలుగా ఉన్నాయి. ప్రస్తుత ల్యాండ్ సీలింగ్ చట్టాలు.. రెండు పంటల సాగుభూములు 10-18 ఎకరాలు, మెట్ట భూములు 35-54 ఎకరాల పరిమితులను విధిస్తున్నాయి. వ్యవసాయంలో సాంకేతికతను, పారిశ్రామిక దృక్కోణాన్ని, మేనేజ్‌మెంట్ పద్ధతుల్ని, మార్కెట్ అవకాశాల్ని ప్రవేశపెట్టేందుకు పెట్టుబడులు కావాలి. ప్రస్తుతమున్న భూ చట్టాలను.. భూపరిమాణం, పెట్టుబడి, సాంకేతికతను పెంచేలా సమగ్రంగా ప్రక్షాళన చేయాలి. పెద్ద కమతాలు, కాంట్రాక్టు వ్యవసాయం, కొత్త పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం అందించటం- ఇవన్నీ సాధ్యమయ్యేరీతిలో చట్టాలు, విధానాలని సంస్కరించటం అవసరం. లేకపోతే సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా ఎందరో వ్యవసాయాన్ని వదిలేసి పట్టణాలకి పరుగులు తీయాల్సి వస్తోంది.

## మెట్ట ప్రాంతాల సాగు - గ్రామీణ ఉపాధి హామీ పథకం

తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా మెట్టభూముల సాగు విస్తృతంగా ఉంది. 50శాతానికిపైగా సాగుప్రాంతానికి నీటి సౌకర్యం లేదు. వర్షం మీదే ఆధారపడి ఇక్కడ వ్యవసాయం చేయాల్సి ఉంటుంది. ఈ సమస్యను అధిగమించటానికి వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ కార్యకలాపాలకి గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల్ని వినియోగించుకోవాలి. పంట పొలాల్లో నీటి గుంతలు తవ్వే కార్యక్రమాన్ని భారీఎత్తున చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టాలి. భూగర్భ జలాల్ని రీఛార్జి చేయాలి. భూ సంరక్షణ కార్యక్రమాల్ని అమలు చేయాలి.

## ఎరువులు - సబ్సిడీ

అలాగే ఎరువుల పంపిణీలో రైతులకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే, భూముల రికార్డులు సక్రమంగా లేవు. పొలానికి రైతులవారీగా, పంటను బట్టి ఎరువుల వినియోగం మారుతుంటుంది. ఎరువులు తెచ్చుకోవటానికి అవసరమైన సర్టిఫికేషన్ అవినీతికి దారితీసే అవకాశముంది. కాబట్టి రైతులకి అదనంగా సమస్యలు తేకుండా ప్రస్తుతమున్న విధానాన్నే కొనసాగించటం ఉత్తమం.

## విద్య, ఆరోగ్యంతోపాటు అవినీతి లేని సేవలకు 'పౌర సేవల' చట్టం

రైతులు కుంగిపోతున్నది కేవలం వ్యవసాయంలో ఆదాయం తగినంతగా లేకపోవటం వల్ల మాత్రమే కాద్మ విద్య, ఆరోగ్యాలకి ఖర్చు విపరీతంగా పెరిగిపోవటం. ప్రజల పన్నుల డబ్బుతో అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాల విద్యని, ఆరోగ్యాన్ని అందించాల్సిన ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. దాంతో కేవలం పిల్లల చదువుకోసమే ఒక్కొక్క కుటుంబం ఏడాదికి రూ.50-60,000 అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అలాగే చిన్న జబ్బు చేసినా వైద్య సౌకర్యం లేక, డాక్టర్లకి, వైద్య పరీక్షలకి, మందులకి వేలకి వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. మంచి విద్యని, ఆరోగ్యాన్ని ఖర్చు లేకుండా అందించి ప్రభుత్వం తన బాధ్యతని నిర్వర్తిస్తే, కోట్లాది గ్రామీణ, పేద కుటుంబాలకి భారం తగ్గుతుంద్మి బీదరికం అంతమవుతుంది.

అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు దేశంలో ఎక్కువగా ఉండే చిన్న, సన్నకారు రైతులను కుంగదీస్తున్నాయి.

హక్కుగా సేవల్ని అందించే 'పౌర సేవల' చట్టాన్ని తీసుకొస్తే.. రైతులకు ఎంతో ఉపశమనం కలుగుతుంది. ఇవన్నీ ప్రజలందరికీ అమలు చేయాల్సినవి. కానీ కనీసం రైతుల వద్దనుంచైనా వీటి అమలు ప్రారంభమవ్వాలి. బాగా చదువుకున్న వారు వ్యవసాయం వైపు మళ్లి సాగును ఈ విధానాలతో ఓ సాఫ్ట్‌వేర్ వ్యాపారంలా చేయటం మొదలుపెడితే, కోట్లాదిమంది జీవితాలు తెరిపిన పడటం మొదలవుతుంది. గ్రామాల నుంచి పొట్ట చేత పట్టుకుని వలసలు పోవటం తగ్గి చిన్న పట్టణాలు అభివృద్ధి చెందటం మొదలవుతుంది. గ్రామాలు-నగరాల మధ్య అంతరాలు తగ్గి దేశం ఈవేళ ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు కనిపిస్తాయి.

ఇంకా కొన్ని అంశాలున్నా- ప్రధానంగా స్వేచ్ఛావాణిజ్యం, ధరల స్థిరీకరణ నిధి, శీతల/గిడ్డంగులు, ప్లెడ్జి రుణాలు, మార్కెట్ యార్డుల ప్రక్షాళన, సహకార వ్యవస్థను బలోపేతం చేయటం, రిటైల్ చెయిన్లు, పరిశోధనల్ని ప్రోత్సహించటం, భూ రికార్డుల్ని సరిచేసి పెట్టుబడులు వచ్చేలా భూ సీలింగ్ చట్టాల్ని హేతుబద్ధీకరించటం, మెట్టసాగును ఉపాధి హామీతో సంధానం చేయటం, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవల్ని అందుబాటులోకి తేవటం మన రైతులకు మెరుగైన ఆదాయాలకు నిర్దిష్ట మార్గాలు.

## రైతు ప్రయోజనాలు- పారిశ్రామికాభివృద్ధి- దేశ సుసంపన్నత కలగలిసిన సమగ్ర విధానాన్ని ఆవిష్కరించాలి

మనదేశంలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడైనా వ్యవసాయం క్లిష్టమైన, నష్టప్రమాదం పొంచి ఉన్న వృత్తి. అయినా కూడా తగిన సంస్థాగత ఏర్పాట్లు, సరైన విధానాలు ఉంటే వ్యవసాయంలో లాభాలకు కూడా అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మరోవైపు, ప్రత్యామ్నాయంతో వ్యవసాయాన్ని పూర్తిగా తొలగించటం కూడా సాధ్యం కాదు. వ్యవసాయమే నాగరికతకు పునాది. వ్యవసాయంతోనే ఆహారభద్రత. వ్యవసాయమే పరిశ్రమలకు ముడిసరుకుల్ని ఇస్తుంది, రోజురోజుకీ ఇంధన కొరతను ఎదుర్కొంటున్న ప్రపంచానికి 'ఇంధన వనరు'గా కూడా ఉపయోగపడుతుంది. ఈ అంశాల్ని గుర్తించే ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు- ఉత్పత్తిని పెంచేందుకు సాగునీరు అందించటం, మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయటం, రుణ సదుపాయం కల్పించటం, పరిశోధన, విస్తరణ, ఆదాయాన్ని కాపాడేందుకు విదేశీ పోటీ నుంచి రక్షణ, అవసరమైనప్పుడు గ్యారంటీ మద్దతు ధర కల్పించటం, ఒడిదుడుకులను, వృధాను నివారించేందుకు బీమా, గిడ్డంగులు, నిల్వ సదుపాయం కల్పించటం, మార్కెట్‌కు అవకాశం కల్పించటం, విలువ ఆధారితంగా మార్చటం- వంటి పద్ధతుల్లో వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

ప్రపంచంలోని వ్యవసాయ భూమిలో 12 శాతం భారతదేశంలోనే ఉంది. పుష్కలమైన సూర్యరశ్మి అందుతుంది. మంచి వర్షపాతం, పటిష్టమైన వ్యవసాయ సంస్కృతి మన సొత్తు. మన బలాల్ని వెలికితీసి సద్వినియోగం చేసి వ్యవసాయాన్ని ఆర్థికవ్యవస్థకు భారంగా కాకుండా, ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని ఆర్జించే రంగంగా, అభివృద్ధికి చోదకశక్తిగా చేసేలా ఒక సమగ్ర విధానాన్ని ఆవిష్కరించాల్సి ఉంది. రైతుల ప్రయోజనాలు, పారిశ్రామికాభివృద్ధి, దేశ సుసంపన్నత ఈ మూడూ పరస్పరం విడదీయలేనివని ఈ వ్యూహాత్మక మార్పు గుర్తించాలి. మొక్కుబడి విధానాలు, తాత్కాలిక తాయిలాలు - వీటి నుంచి బయటపడి హేతుబద్ధమయిన విధానాలు, రైతుకి దీర్ఘకాలంలో ఆదాయాలు పెంచి, ఖర్చులు తగ్గించే మార్గాలు, బతుక్కి భరోసా కల్పించే పద్ధతులని ప్రవేశపెట్టాలి. రైతు, వినియోగదారుడి అభివృద్ధి విడదీయలేని పరస్పర ఆధారితమైన లక్ష్యం.

మన వ్యవసాయాన్ని శక్తిమంతమైన, ప్రపంచస్థాయిలో పోటీపడగల, వేగంగా అభివృద్ధిని సాధించగల, ఉద్యోగావకాశాలను సృష్టించగల రంగంగా తీర్చిదిద్దుకోగల శక్తి భారత్‌కు ఉంది. మన ఆర్థిక వ్యవస్థకు ఏదైతే భారంగా కనిపిస్తోందో ఆ వ్యవసాయ రంగమే అభివృద్ధికి చోదకశక్తి కాగలదు. పేదరికానికి బదులు అభివృద్ధిని .. వరాలు, తాత్కాలిక తాయిలాలకు బదులు అవకాశాల్ని .. ప్రభుత్వ నియంత్రణలకు బదులు స్వేచ్ఛని మనం ఎంచుకోవాలి. తీవ్ర అవరోధాలకు, ఆటుపోట్లకు, అడుగడుగునా బంధనాలకూ ఎదురొడ్డి మన రైతులు గొప్ప ఫలితాలను సాధించి చూపారు. ఒక్కసారి సంకెళ్లను తొలగించి, సరైన ప్రోత్సాహకాలను అందిస్తే చాలు.. భారతీయ రైతులు ప్రపంచంలో ఎవరితోనైనా దీటుగా పోటీపడగలరు. మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పును తేగలరు.

దేశంలోని పలు రాష్ట్రాల్లో రైతుల తలసరి ఆదాయం వార్షిక ఆదాయం రూ.25,000 లోపే ఉంది. అంటే నెలకు సుమారు రూ.2,000. ఈ ఆదాయాన్ని కనీసం రూ.లక్షకు పెంచకుండా అభివృద్ధి గురించి చెప్పుకోవటం ఆత్మవంచనే అవుతుంది. రైతులకిచ్చే ప్రతి పథకాన్నీ కౌలురైతుకి కూడా వర్తింపచేయాలి. వ్యవసాయంలో ఆదాయం పెరిగితే కౌలురైతుకి కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. వ్యవసాయాన్ని ధర్మబద్ధ వ్యాపారంలా చేస్తూ రైతులు ఆదాయాన్ని పెంచుకునే విధానాలను ప్రభుత్వాలు అమలుచేస్తే, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పౌర సేవల్ని అందిస్తే వారు స్వచ్ఛందంగా, సంతోషంగా పన్నులు కూడా చెల్లించి సుపరిపాలనలో తమ వంతు భాగస్వాములవుతారు.

# సురాజ్య యాత్రలోనూ ఇదే నిగ్గుతేలింది

దృశ్యాలు మారొచ్చు.. కానీ సమస్య పాతదే- రైతుకి ఆదాయాలు పెరగకపోవటం, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా లెక్కేస్తే ఇంకా తగ్గిపోవటం! దీన్ని కేంద్రబిందువు చేసి సమస్యను పరిష్కరించే ఏర్పాట్లు చేయనంత వరకూ ఎన్నేళ్లు గడిచినా, ఎన్ని భావోద్వేగాల్ని ప్రదర్శించినా వ్యవసాయ సమస్యలు తీరవు. 2017 సెప్టెంబర్ నుంచి డిసెంబర్ దాకా ఆంధ్రప్రదేశ్‌లో పార్టీలకతీతంగా నేను చేసిన సురాజ్య యాత్రలో కూడా ఇదే విషయం మళ్లీ నిగ్గుతేలింది.

సురాజ్య యాత్ర లక్ష్యాలైన ఆరింటిలో 'వ్యవసాయాన్ని లాభసాటి చేయటం' ఒకటి. అందువల్ల ప్రతి జిల్లాలో మార్కెట్లను సందర్శించాను, చాలాచోట్ల రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యాను, కొన్నిచోట్ల పొలాల్లో పంటల్ని పరిశీలించాను. రైతులెదుర్కుంటున్న సంక్షోభం చాలా తీవ్రమయినది, ప్రధానంగా పంటలకి ధరలు లేకపోవటం వల్ల ఈ సంక్షోభం ముదురుతోంది. వ్యవసాయ సంక్షోభానికి సంబంధించి ఏపీ, తెలంగాణ, ఇతర రాష్ట్రాలకమధ్య మౌలికమైన తేడా లేదు కాబట్టి.. ఈ పరిశీలనలు అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తాయి.



రుణమాఫీ వల్ల ఒరిగేదేమీ లేదని, ఆ డబ్బునే ధరల స్థిరీకరణ నిధి వంటి ఏర్పాట్లతో పంట ఉత్పత్తుల ధరలు పెంచేందుకు ఉపయోగించాలని నేను అన్ని పార్టీలకూ విజ్ఞప్తి చేశాను. ఆ హెచ్చరికే వాస్తవమని నాకు క్షేత్రస్థాయిలో కూడా తేలింది. శ్రీకాకుళం మార్కెట్ నుంచి చిత్తూరు జిల్లా మదనపల్లి టమాటా మార్కెట్ దాకా ఎక్కడా రైతు సంతోషంగా లేడు. ధాన్యం, మిర్చి, పత్తి, వేరుసెనగ, మొక్కజొన్న, మినుములు, ఉల్లిపాయలు.. పంట ఏదైనా పలు సందర్భాల్లో రైతుకి ఆదాయాన్ని ఇవ్వలేకపోతున్నాయి.

అప్పులు తీరకపోగా.. ధర్మవడ్డీకి అప్పులు పుట్టక హెచ్చువడ్డీకి తెచ్చుకుని ఇంకా అప్పులు పాలవ్వాల్సిన పరిస్థితి రుణమాఫీ వల్ల పెరిగింది. కొందరు పారిశ్రామికవేత్తలు ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన రుణాలు పేరుకుపోయి బ్యాంకుల మొండి బకాయిలు లక్షల కోట్లకు చేరటం (బ్యాంకుల మొండి బకాయిల్లో వ్యవసాయం వాటా పెరుగుతున్నప్పటికీ మొత్తం బకాయిల్లో రైతుల వాటా 7-8 శాతం (రూ. లక్ష కోట్ల లోపు) మాత్రమే), కొత్త కరెన్సీని అందుబాటులోకి తేకుండానే పెద్ద నోట్ల రద్దును ప్రకటించటం వ్యవసాయ రుణ సంక్షోభాన్ని ఇంకా పెంచింది.

రుణమాఫీ వల్ల.. రైతుల అభివృద్ధికే ఎంతో ఉపయోగపడే ఆరోగ్యం, మౌలిక వసతులు, ప్రభుత్వ సేవల విస్తరణ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు వంటి కొన్ని ప్రధాన రంగాలు నిధులకొరత నెదుర్కొన్నాయి.

కాడి పారేయలేక.. అయినకాడికి పంటల్ని తెగనమ్ముకుని కర్షకులు బండి నడిపిస్తున్నారు. కర్నూలు జిల్లాలో అనుకుంటా.. ఒక రైతు నిరాశ చూసి నేను వేదనను ఆపుకోలేకపోయాను. మార్కెట్ యార్డులోకి తెచ్చిన పంటకు కొన్ని రోజులుగా రేటు లేకపోవటంతో అతను డిప్రెషన్‌లో కూరుకుపోయి ఉన్నాడు. అతనికి ధైర్యం చెప్పటంతోపాటు వెంటనే వైద్యచికిత్సను కూడా అందించాలని స్థానిక వలంటీర్లకు అప్పచెప్పాను. రైతులు చనిపోయాక రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వటం కాదు, వాళ్లు బలవన్మరణాలకు పాల్పడకుండా బతికి సంపాదించుకునే విధానాలను వ్యవసాయంలో అమలు చేయాలి.

తెలుగునాట రిటైల్ మార్కెట్లలో కిలో టమాటాలు రూ.20పైగా పలికే సమయంలో కూడా మదనపల్లె, ఆదిలాబాద్ వంటి టోకు మార్కెట్ల వద్ద రైతుకి.. చెలామణిలో లేని చిల్లర నాణేల స్థాయిః(పావలా, అర్ధరూపాయి) రేటు పలికింది. పంటపొలాల్లో కోయకుండా పశువులకు వదిలేయటం, రోడ్ల మీద పారబోయటం యధావిధిగానే సాగుతోంది.

2014కి ముందున్న యూపీయే ప్రభుత్వ హయాంలోనే వ్యవసాయ వృద్ధి 3.7 శాతానికి తగ్గిపోయింది. ఆ తర్వాత మోదీ నేతృత్వంలో వచ్చిన ఎన్డీయే ప్రభుత్వంలో వ్యవసాయం ఇంకా పతనమైంది. రాష్ట్రాల్లో ప్రభుత్వాల రైతు రుణమాఫీ వంటి తాత్కాలిక తాయిలాలు సంక్షోభాన్ని ఇంకా ముదరపెడుతున్నాయి. ఈ-నామ్, పంటల బీమాకు ప్రధానమంత్రి పథకం, మద్దతు ధర పెంపు వంటివి అమలు చేస్తున్నామని పాలకులు, అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో వ్యవసాయం ఇంకా ఇంకా దిగజారుతోంది.

# పెరిగిన దిగుమతులు, పడిపోయిన ఎగుమతుల వల్ల ఏడాదికి రూ.1,40,000 కోట్ల డిమాండ్‌కు దెబ్బ

రైతుకి ఆదాయాన్ని పెంచేలా వ్యవసాయ ఎగుమతుల్ని పెంచి దిగుమతులను నియంత్రించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించటం వల్ల మన రైతులు ఏడాదికి రూ.1,40,000 కోట్ల మేర డిమాండ్‌ను నష్టపోవాల్సి వచ్చింది. 2013-14లో మన ఎగుమతులు 43.23 బిలియన్ డాలర్లుండగా, దిగుమతులు 15.52 బిలియన్ డాలర్లున్నాయి. అదే 2016-17 నాటికి ఎగుమతులు 33.87 బిలియన్ డాలర్లకి పడిపోగా, దిగుమతులు 25.63 బిలియన్ డాలర్లకి పెరిగాయి. అంటే ప్రతి ఏడాది, ఎగుమతులు సుమారు 10 బిలియన్ డాలర్లు తగ్గగా, దిగుమతులు 10 బిలియన్ డాలర్లకి పైగా పెరిగాయి. వెరసి రైతులకి ఏటా 20 బిలియన్ డాలర్ల ఆదాయం తగ్గింది. అంటే, ఏడాదికి దాదాపు రూ.1,40,000 కోట్ల మేర రైతులు అదనంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ జోక్యం లేకపోయినా రైతులు స్వశక్తితో అభివృద్ధి చేసుకున్న చేపలు వంటి ఎగుమతుల్ని కూడా కలుపుకుంటేనే ఇంతస్థాయిలో ఎగుమతులు పడిపోయాయి.

దిగుమతుల విషయంలో కూడా వ్యవసాయదారుల ప్రయోజనాలను పరిరక్షించేలా వ్యవహరించే విధానాలు లేకుండా పప్పుదినుసులు, నూనెగింజల్ని దేశంలోకి అనుమతిస్తుండటంతో మన రైతులు తీవ్రంగా నష్టపోయారు.

మనం ప్రపంచంలోనే అత్యధికంగా రూ.1లక్ష కోట్ల మేర పప్పుల్ని, వంటనూనెల్ని దిగుమతి చేసుకుంటున్నాం. 2013-14లో పప్పులను మనం రూ.12,792కోట్ల మేర దిగుమతి చేసుకుంటే, 2016-17లో అది రూ.28,524 కోట్లకు చేరింది. అలాగే నూనెగింజల్ని 2013-14లో రూ.60,750 కోట్ల దాకా దిగుమతి చేసుకుంటే, 2016-17లో అది రూ.70,000 కోట్లకు చేరుకుంది.

దీంతో, మినుముల్నే తీసుకుంటే.. అంతకుముందు ధర క్వింటాలుకు రూ.13,000-14,000 వరకు ఉందని పంట వేసిన రైతులు తీవ్రంగా షాక్ తినే పరిస్థితి ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో మినుముల ధరల క్వింటాలు రూ.14,000 నుంచి రూ.4,000కు పడిపోయింది.

ఈ రకంగా.. కేవలం ఒక్క కలంపోటుతో అమలు చేయగలిగే ఎగుమతులు-దిగుమతులకు సంబంధించి పాలకుల తప్పుడు విధానాల వల్ల దేశవ్యాప్తంగా రైతులకు 2014-17 మధ్య కాలంలోనే సుమారు రూ.4 లక్షల కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని ప్రభుత్వాలు, సమాజం దృష్టికి నేను పలుమార్లు గట్టిగా తీసుకెళ్లాను.

సమృద్ధిగా వ్యవసాయ సామర్థ్యం ఉన్న దేశంలో ఇలా వ్యవసాయోత్పత్తుల్నే దిగుమతి చేసుకోవడం ప్రపంచంలో మరే దేశంలోనూ జరగదు. మన ప్రభుత్వాలు చేస్తున్న పనుల గురించి చెబితే విదేశాల్లో నమ్మను కూడా నమ్మరు. కానీ మనదేశంలో మాత్రం ఇలా రైతులను దెబ్బతీసే ఎగుమతి-దిగుమతి విధానాన్ని అనుసరిస్తున్నారనేది కఠిన వాస్తవం. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోపే.. దేశీయ మార్కెట్లలో ఉల్లి ధరలు పెరిగాయని చెప్పి, కాలం చెల్లిన నిత్యావసర సరకుల చట్టాన్ని ఉపయోగించి మరీ ఉల్లిపాయల ఎగుమతుల్ని నిషేధించింది. ఆ తర్వాత మూడు నెలల్లోనే ధరల్లేక ఉల్లి రైతు కంట నీరు వస్తుంటే మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు.

వినియోగదారులకు మార్కెట్లో తక్కువ ధరకు పప్పులు, వంటనూనెలు అందించాలన్న ఆలోచన తప్పితే, ఆ దిగుమతుల మీద సుంకం విధించి ఆ డబ్బును రైతులకు ప్రోత్సాహకాలుగా ఇస్తే మనదేశం స్వయం సమృద్ధ మవటంతోపాటు రైతులకు మంచి ఆదాయం వస్తుందని, వినియోగదారులకూ లాభం జరుగుతుందని పాలకులు ఆలోచించటం లేదు. దాదాపు రూ.1లక్ష కోట్ల మేర దిగుమతి చేసుకుంటున్న వంటనూనెల మీద ఇటీవలి దాకా చాలా తక్కువ సుంకం ఉంది. వంటనూనెలను రిఫైన్ చేసే పరిశ్రమల కోసమే ఆ మాత్రం సుంకమైనా ఉంది తప్ప రైతుల కోసం కాదు. పప్పుధాన్యాల మీద దాదాపు సుంకమే లేదు.

ఆ దిగుమతుల మీద 40శాతం దిగుమతి సుంకం వేస్తే రూ.40,000కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఆ డబ్బును మన రైతులకే బోనస్‌గా ఇస్తే మన కర్షకులు మెరుగైన ఫలితాలు సాధిస్తారు. ఇలా చేస్తే మూడు లాభాలున్నాయి. ఒకటి, దిగుమతి సుంకం వల్ల రైతుకి మార్కెట్లో రేటు నిలబడుతుంది; రెండు, రైతుకి ప్రోత్సాహకంగా ఈ డబ్బుని ఇస్తే ఉత్పత్తి పెరిగి దిగుమతుల అవసరం ఉండదు, దేశానికి డాలర్లు మిగులుతాయి; మూడు, ఈ మొత్తానికి ప్రభుత్వానికి అదనపు ఖర్చు ఉండదు, దిగుమతి సుంకం ఆదాయాన్నే రైతులకు ప్రోత్సాహకాలుగా ఇవ్వవచ్చు. క్రమంగా రైతులు పుంజుకునేలా ప్రోత్సహిస్తే మూడేళ్లలోనే దిగుమతులు అవసరం లేకుండా దేశాన్ని పప్పులు, వంటనూనెల్లో స్వయంసమృద్ధం చేస్తారు. ఖజానాపై భారం లేకుండానే ప్రభుత్వం రైతులకు ఆదాయాన్ని అందించవచ్చు, వ్యవసాయాన్ని కొంతమేర బాగుచేయవచ్చు. కానీ ప్రభుత్వం దిగుమతిసుంకం ఆదాయాన్ని ఖజానాలో వేసుకుంటోంది తప్ప, రైతులకి ఏ ప్రయోజనమూ చేకూర్చటం లేదు.

# రైతుల ఛాంపియన్‌ని ఏడిపించా!

## ఫాదర్ ఆఫ్ వైట్ రివల్యూషన్ ఇన్ ఇండియా .. వర్గీస్ కురియన్‌తో ఒకరోజు

- తాడి ప్రకాష్, సీనియర్ జర్నలిస్టు

**అర్థరాత్రి... హైవే...**
**చీకటినీ, చినుకుల్నీ**
**చీల్చుకుంటూ బస్సు దూసుకుపోతోంది.**
**గుజరాత్ వెళ్తున్నాం మేమంతా.**
**అది 1985 చివరిలో.**

విజయవాడ 'ఉదయం' దినపత్రికలో చీఫ్ సబ్ ఎడిటర్ని నేను. మరో 40 మంది విజయవాడ పత్రికా విలేకరులు. ఖేడా జిల్లాలోని ఆనంద్ అనే చిన్న పట్టణానికి వెళుతున్నాం. అక్కడ అమూల్ పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీని చూడటం, వర్గీస్ కురియన్ని కలవడం! రెండు ముఖ్యమైన పనులు. సహకార మార్కెటింగ్‌తో మిల్క్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచి, దేశానికి రోల్‌మోడల్‌గా వెలిగిపోతున్న కురియన్ పేరు బాగా విన్నదే. ఇందిరాగాంధీకి మిత్రుడు. పాల కొరతతో కొట్టుమిట్టాడుతున్న ఇండియాని, పాల ఉత్పత్తిలో ప్రపంచ నెంబర్‌వన్‌గా ఒంటిచేత్తో నిలబెట్టిన హీరో కురియన్. కేరళ (కొయికోడ్)లో పుట్టాడు.

అమెరికాలో చదువుతో రాణించాడు. త్రిభువన్‌దాస్ దగ్గర మొదట జనరల్ మేనేజర్‌గా జాయినయ్యాడు కురియన్. మార్కెటింగ్ వ్యూహంలో దిట్ట. మనిషి ఎంత ఎగ్రసివ్‌గా ఉంటాడో అంత ప్రోగ్రెసివ్.

ఆనంద్ చుట్టుపక్కల అంతా పశుసంపదతో అలరారే ప్రాంతం. గతంలో రైతులు పాలని అతితక్కువ ధరకి అమ్ముకునేవాళ్లు. షావుకార్లు, బ్రోకర్లూ లాభపడితే, రైతులు నష్టపోయేవాళ్లు. దగ్గర్లోని బొంబాయి మహానగరానికి ఎన్ని లక్షల లీటర్ల పాలయినా చాలవు. కురియన్ చేసిందీ వ్యాపారమే అయినా, రైతులకు మంచి ధర వచ్చే వ్యాపారం ఇది. లక్షలాదిమంది రైతులు అమూల్‌కి పాలు మాత్రమే అమ్మారు. నిజంగా వాళ్ల నెత్తిన పాలు పోసినవాడు కురియన్. ఆ పేద రైతుల ఇళ్ల గుమ్మాల మీద వెయ్యి కాంతుల ఆశల దీపాలుగా వెలిగినవాడు కురియన్. సహకార పంథాలో రైతులందర్నీ కంపెనీలో భాగస్వాముల్ని చేశాడు. అమూల్ అంటే అమూల్యమైనదని మాత్రమే కాదు. ఆనంద్ మిల్క్ యూనియన్ లిమిటెడ్ అని!



వెన్న, చీజ్, ఐస్‌క్రీమ్, చాక్లెట్లు, స్వీట్లు... ఇలా ఉత్పత్తుల్ని పెంచాడు. కళ్లు చెదిరే మార్కెటింగ్‌తో బొంబాయి మహానగరాన్ని జయించాడు. క్రమంగా ఇండియాని అమూల్ ఉత్పత్తులతో ముంచెత్తాడు. విదేశాల్లో విస్తృతంగా అమ్మి అమూల్‌ను ఇంటర్నేషనల్ బ్రాండ్‌గా నిలబెట్టాడు. అంతవరకూ ఆవు పాలతో మాత్రమే పొడి చేసేవారు. భారీగా మిగులుతున్న గేదె పాలతో పొడి తయారుచేసి చరిత్ర సృష్టించాడు. లాభాల్ని కోట్లలో పెంచాడు. ఆ రోజుల్లోనే- హైక్లాస్ బాంబే యాడ్ ఏజన్సీ వాళ్లని పిలిచి నేషనల్ క్యాంపైన్ ప్లాన్ చేయించాడు. 'అమూల్ - అట్టర్లీ బట్టర్లీ డెలీషియస్' అనే స్లోగన్‌ని కాయిన్ చేసింది వాళ్లే. చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లు అంటే పిల్లల్ని ఆకర్షించాలి. పోనీటెయిల్ వేసుకున్న చుక్కల గౌను పాప బొమ్మని యాడ్ ఏజన్సీ వాళ్లు చూపించారు. 'ఓ యస్' అన్నాడు కురియన్!

చిన్న పన్‌తో వెటకారంతో, నవ్వించే క్యాప్షన్‌తో ఆ పాప బొమ్మ... అమూల్‌నే కొనండి, అమూల్‌నే తినండి.. అంటుంది. ఖరీదైన నేషనల్ యాడ్ క్యాంపైన్ జనాలకి నచ్చింది. ఆ పాప అమూల్ ఐకాన్ అయిపోయింది. 50 ఏళ్ల తర్వాత ఇప్పటికీ అమూల్ యాడ్స్‌లో ఆ పాపే ఉంటుంది. రకరకాల గౌన్లతో... క్రీడలూ, ప్రపంచ రాజకీయాలు, ప్రధాన సంఘటనలూ అన్నింటినీ రుచి కోసం అమూల్ యాడ్స్‌లో చాలా యాప్ట్‌గా వాడతారు.

కురియన్ విజయాల్ని ఆపరేషన్ ఫ్లడ్ అన్నారు మురిపెంగా. పాలవెల్లువ అన్నారు తెలుగు జర్నలిస్టులు. కురియన్ గడుసుతనాన్నీ, దురుసుతనాన్నీ చూసినవాళ్లు ఆయన్ని "పాలల్లో ఈతకొట్టే మొసలి" అన్నారు.

## స్మితా పాటిల్‌తో మంథన్ (churning):

కురియన్ ఓ రోజు శ్యాంబెనగల్‌కి ఫోన్ చేశాడు. అప్పటికి చిన్న చిన్న యాడ్ ఫిల్మ్ చేసుకుని బండి లాగిస్తున్నాడు బెనగల్. "ఆనంద్‌లో అమూల్ విజయమ్మీద సినిమా తీద్దాం... పొదుపుగా సుమా" అన్నాడు. లెక్కలేసి పది పన్నెండు లక్షలు అవుతుందన్నాడు శ్యాం. మిల్క్ కోపరేటివ్ సభ్యులైన అయిదు లక్షల మంది రైతుల నుంచి రెండేసి రూపాయలు సేకరించి శ్యాంబెనగల్‌కి ఇచ్చాడు. రైతులంతా ఈ చిత్ర నిర్మాతలే అని ప్రకటించాడు కురియన్. ఆ రకంగా 'మంథన్' భారతీయ వెండి తెర మీద తొలి ఒరిజినల్ క్రౌడ్ ఫండింగ్ ఫిల్మ్‌గా నిలిచిపోతుంది. 1975లో స్మితా పాటిల్, నసీరుద్దీన్ షా, అమ్రిష్ పురి, గిరీష్ కర్నాడ్, అనంత్‌నాగ్, కుల్‌భూషణ్ కర్బందాలతో తీసిన ఆ సినిమా 1976లో విడుదలైంది. ఒక లెజెండ్ విజయ్ టెండూల్కర్ స్క్రీన్‌ప్లే, మహాకవి కైఫీ అజ్మీ మాటలు, వనరాజ్ భాటియా సంగీతం, గోవింద్ నిహలానీ ఫొటోగ్రఫీతో మహాశిల్పి శ్యాం బెనగల్ చెక్కిన పాలరాతి శిల్పం-మంథన్. పేదరైతులు, దళితుల్ని స్థానిక, ధనిక పెత్తందార్ల వేధింపులు, దోపిడీ నుంచి రక్షించి 'పాలవెల్లువ'కు అడ్డుతొలగించటమే కథ. మంథన్.. ఆ ఏడాది ఉత్తమ జాతీయ చిత్రం, ఉత్తమ స్క్రీన్‌ప్లే నేషనల్ అవార్డులు గెలుచుకుంది. మంథన్, అంకుర్, నిశాంత్.. శ్యాంబెనగల్ సినిమాలన్నీ మూడేసి సార్లు చూసి ఉన్నాను. వాటిని విజువల్‌గా అప్పజెప్పగలను కూడా..!

...

ప్రయాణంతో అలసిపోయి ఆనంద్‌లో బస్సు దిగాం. అదో గొప్ప యూనివర్సిటీ క్యాంపస్‌లా ఉంది. అన్ని సౌకర్యాలతో బోలెడన్ని గెస్ట్‌హౌస్‌లు.

చుట్టూ పలకరిస్తున్న పచ్చదనం, తారు రోడ్లు. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ అన్నీ పర్‌ఫెక్ట్‌గా. మూడురోజులున్నాం. ఒకరోజు గ్రామాల్లోతిప్పారు.

రైతుల వ్యవసాయ క్షేత్రాలు, పశువులకు పచ్చగడ్డీ, మంచి దాణా వేయడం, పోషణ పరిశుభ్రతలు, గ్రామీణ రైతుల శ్రద్ధ.. యివన్నీ చూశాం. రెండో రోజు అమూల్ మెగా ఫ్యాక్టరీలోకి అడుగుపెట్టాం. కళ్లు తిరిగి కింద పడబోతే ఐస్‌క్రీమ్ ఇచ్చి నిలబెట్టారు. అంతంత భారీ మెషీన్లనీ, వాటి ఆపరేషన్ని చూడటం గొప్ప అనుభవం.

వెయ్యిమందికి పైగా కార్మికులు, మార్కెటింగ్ సిబ్బందీ ఉన్నారు. మొత్తం మెకనైజ్డ్ సిస్టం. సాయంత్రం చదూకోడానికి అమూల్, కురియన్ గురించిన పుస్తకాలు, బ్రోచర్లు ఇచ్చారు. చివరిరోజు కురియన్‌తో ప్రెస్ కాన్ఫరెన్స్.

నా బాణం గురితప్పలేదు!

అందరం ప్రెస్‌మీట్ హాల్‌కి వెళ్లాం. కనీసం 150 మంది అటూ ఇటూ కూర్చునే వీలున్న పొడవాటి టేబుల్, విశాలమైన హాలు, కొన్ని పెయింటింగులు. ఓ పక్క పెద్ద స్క్రీన్ మీద కురియన్ విజయాలన్నీ చూస్తున్నాం. ఇంత భారీ విజువల్ బిల్డప్ తర్వాత, అరగంట నిరీక్షించాక, పెద్ద పెద్ద అంగలతో గబగబా వచ్చాడు కురియన్. కుర్చీలో కూర్చోగానే ఉపన్యాసం మొదలు పెట్టాడు. దేశం, ప్రజలు, ప్రజాస్వామ్యం, అభివృద్ధి, విలువలు గురించి! (అది నాకు నచ్చలేదు. కనీసం ఆయన గుజరాత్ సీఎం కూడా కాదు గదా, ఇవన్నీ మాట్లాడటమేంటి అనిపించింది).

"ఓకే షూట్ మీ క్వశ్చన్స్" అన్నాడు.

పాలలో కొవ్వు శాతం, ఉత్పత్తి, లాభాలు, అమ్మకాలు అని విలేకరులు అడుగుతుంటే, ఇంగ్లీషులో గుక్కతిప్పుకోకుండా కురియన్ వివరాలు గుప్పిస్తున్నాడు. ఆయన్ని ఆపడం కష్టం. ఏదన్నా ప్రశ్న అడగాలి...

ఏం అడగాలి?

విజయవాడ నుంచి యింత దూరం వచ్చాం. ఒక్క ప్రశ్నయినా అడక్కపోతే ఎలా? అడిగానే అనుకో... ఆయన అమెరికన్ ఇంగ్లీషులో ఎదురుప్రశ్న వేస్తే తట్టుకోవడం ఎలా? ఆయన మెగా ఈగో తెలుస్తూనే ఉంది. ఐనా వీడికో దెబ్బవెయ్యాల్సిందే అనిపించింది.

గింజుకుంటున్నాను.

చాలాసేపయింది.

పత్రికా సమావేశం ముగిసిపోబోతున్నది.

నా దగ్గరున్న బ్రోచర్ తిరగేస్తే, కురియన్‌కి 64 ఏళ్లు నిండబోతున్నాయి. 65లోకి రానున్నాడు.

తెగించి, 'వన్ క్వశ్చన్' అన్నాను.

కురియన్‌కి బాగా దగ్గర్లోనే కూర్చుని ఉన్నాను.

చెప్పు అన్నట్లు నావైపు చూశాడు.

"Don't you think its time to retire sir?"

అన్నాను.

నన్ను అలా గుచ్చి చూస్తూనే ఉన్నాడు

నిశ్శబ్దం. లేచి వచ్చి తన్నడు కదా అనుకున్నా.

ఆయన కళ్లలో నీళ్లు నిండుతున్నాయి.

కురియన్ ఏడుస్తున్నాడు.

చెంపల మీంచి నీళ్లు, ఆయన కోటు మీద కన్నీళ్లు టపటపా రాల్తున్నాయి. అందరం ఒక దిగ్భ్రమతో చూస్తున్నాం. ఒక నిమిషం దాటింది. జేబులోంచి కర్చీఫ్ తీశాడు. కన్నీళ్లు తుడుచుకున్నాడు. కదిలిపోయిన మనిషి తేరుకున్నాడు.

"Yes, I will quit this chair right now, but show me another Kurian! Yes, I want to retire tomorrow, give me one more Vargheese Kurian! Yes, show me another Kurian!"

ప్రెస్ మీట్ ముగిసింది ఉద్రిక్తంగా. నిజమైన జనం కోసం పనిచేసి, సోషలిస్టు తరహా విధానం అంటే ఏమిటో చూపించిన ఒక ఆదర్శమూర్తిని హర్ట్ చేశాను... ఒక్క వాక్యంతో!

### Sunrise and surprise in Surat

**తిరుగు ప్రయాణం**

రాత్రి లేటుగా బయల్దేరి ఉదయానికల్లా సూరత్ చేరుకున్నాం. ఇంగ్లీషు పత్రికల విలేకరులు పోస్టాఫీసులకీ, ఎస్టీడీ బూత్‌లకీ వెళ్లి అమూల్ వార్తలను పంపుతున్నారు. ఉదయం దినపత్రికకి యిది అర్జెంటు వార్త కాదు. వెళ్లాక తీరిగ్గా రాయొచ్చు. చాయ్ తాగుదామని వెళ్తూ షాపులో టైమ్స్ ఆఫ్ ఇండియా కొన్నాను.

మొదటి పేజీలో ప్రముఖంగా ఒక బాక్సు అయిటం. “వల వలా ఏడ్చిన కురియన్” అనే హెడ్డింగ్‌తో. ఒక యువ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు కురియన్ పత్రికా సమావేశంలో ఏడ్చారని వివరంగా రాశారు.

నా ప్రశ్న ఫలించినందుకు ఆనందించాను. ఆనంద్‌లో ఇచ్చిన స్వీట్లు బస్సులో మిత్రులకు పంచాను.

తిన్నగా, తియ్యగా విజయవాడ చేరుకున్నాం.

### A true Indian people's Hero

1921 నవంబరు 26న కేరళలోని ఒక సిరియన్ క్రిస్టియన్ కుటుంబంలో పుట్టారు కురియన్. పాతకాలం మనుషులకు కొన్ని భేషజాలు, పట్టింపులు ఉండటం సహజం. రామన్ మెగసెసే, పద్మవిభూషణ్ అవార్డులు పొందినవాడు కురియన్. ప్రతి భారత ప్రధానమంత్రీ ఆనంద్ వెళ్లి అమూల్‌ను చూశారు. మనస్ఫూర్తిగా కురియన్‌ని అభినందించారు. 2005 దాకా, అమూల్‌ని ఆకాశమార్గాన నడిపించినవాడూ, విజయగర్జన చేసినవాడూ వర్గీస్ కురియన్ ఒక్కడే.

ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తాకు కూడా

## మెంటార్‌గా వ్యవహరించారు

**-బీపీఆర్ విఠల్‌కు జేపీ ఘననివాళి**



సివిల్ సర్వెంట్‌గా, ఆర్థికవేత్తగా, ప్రజావిధానాల నిపుణుడిగా, స్థానిక ప్రభుత్వాల మద్దతుదారుగా ఈ దేశానికి బహుముఖ సేవలందించిన బీపీఆర్ విఠల్ మృతి పెద్ద లోటని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 10వ ఆర్థికసంఘం సభ్యునిగా, ఇతరత్రా హోదాల్లో పదవులకు ఆయన వన్నె తెచ్చిన తీరుని గుర్తుచేసుకున్నారు. “చతురత, విజ్ఞత కలబోసిన ఆలోచనాపరుడు విఠల్. నాకో అద్భుతమైన మార్గదర్శి. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తాకు అనేక దశల్లో మెంటార్‌గా వ్యవహరించారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం” అని నివాళులర్పించారు.

# సహకార సంస్థలకు ప్రోత్సాహం ఏదీ?

- మహబూబ్ ఆజం



"ఒక్కరి కోసం అందరు – అందరి కోసం ప్రతి ఒక్కరూ" అనే నినాదం సహకార వ్యవస్థ దృక్పథానికి ప్రతిబింబం. స్వప్రయోజనాలనే కాకుండా ఉమ్మడి ప్రయోజనాల్ని కూడా పొందేందుకు సహకార సిద్ధాంతం పునాదులను నిర్మించింది. ఈ క్రమంలోనే సభ్యుల వ్యక్తిగత, సమష్టి ఆకాంక్షలతో సహకార వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఇంగ్లండ్‌లోని 'రాక్‌డెల్' అనే గ్రామంలో ఉన్న 28 మంది నేత పనివారు 'రాక్‌డెల్ పయనీర్స్' అనే పేరుతో తమ సమష్టి అవసరాల కోసం 1844లో ఒక సహకార సంఘం (కన్స్యూమర్స్ స్టోర్)ను ఏర్పాటు చేసుకున్నారు. 175 సంవత్సరాల క్రితం ఆ సంఘం ఏర్పాటుకు ప్రాతిపదికే సహకార వ్యవస్థకు తాత్విక భూమిక అయ్యింది. 'సహకారం' అనే పదం ఒక ప్రత్యేక అర్థాన్ని స్ఫురింపజేస్తుంది. అది ఒక ఉమ్మడి ఆర్థిక ప్రయోజనం/ప్రయోజనాల కోసం వ్యక్తులు సమష్టిగా, పరస్పర సహ కారంతో, స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న వేదికగా పరిగణించ బడుతుంది. భిన్న ఆర్థిక సిద్ధాంతంగా ప్రాచుర్యం పొందిన పెట్టుబడిదారీ ఆర్థిక విధానమైనా, సోషలిస్టు ఆర్థిక విధానమైనా సహకార సిద్ధాంతానికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఇచ్చాయంటే ఆ సిద్ధాంతానికి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు.

మన దేశంలో సహకార ఉద్యమం 1880 దశకంలోనే మొదలైనప్పటికీ అది 1904 నాటికిగాని చట్టరూపం దాల్చలేదు. సుదీర్ఘ సహకార ఉద్యమ చరిత్ర మన దేశానికుంది. ప్రజల భాగస్వామ్యం, పరస్పర సహకారం లక్ష్యంగా ఏర్పడిన సహకార సంస్థలకు మరణం లేదు. అవి ప్రజల జీవన విధానంలోనూ, సంస్కృతిలోనూ అవిభాజ్యమైన భాగాలు. వీటిని దృఢంగా నమ్ముతూ వీటి ప్రాతిపదిక మీదే ఏర్పడింది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్. రాజకీయాలకు అతీతంగా, సహకార సూత్రాలకు కట్టుబడి, సమష్టిగా కృషి చేస్తే సహకార సంస్థలు ప్రజల సంస్థలుగా గుర్తింపు సాధించగలవని తన ఆచరణ ద్వారా ఈ బ్యాంకు నిరూపించింది. విశాఖపట్నం కేంద్రంగా 1916 ఫిబ్రవరి 5వ తేదీన ప్రారంభమై తన నిర్మాణాత్మక పాత్ర ద్వారా సహకార రంగంలో విశిష్ట స్థానాన్ని, ప్రత్యేకతను ఏర్పరచుకుంది. తనను తాను అభివృద్ధి చేసుకోవటంతోపాటు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సహకార అర్బన్ బ్యాంకులను ఐక్యం చేయటంలో క్రియాశీల భూమికను నిర్వహిస్తోంది.

మన దేశంలో ప్రస్తుతం వివిధ రంగాల సహకార సంఘాలు ఆరు లక్షలకుపైగా పనిచేస్తుండగా, వాటిలో 25 కోట్ల మంది సభ్యులుగా ఉన్నారని ఒక అంచనా. 2018 సంవత్సరాంతానికి దేశవ్యాప్తంగా 1551 అర్బన్ బ్యాంకులు పనిచేస్తుండగా, 2020 నాటికి వాటి సంఖ్య 1540కు తగ్గింది. వీటిలో 54 అర్బన్ బ్యాంకులు షెడ్యూల్డ్ హోదాను పొందగా మిగిలిన బ్యాంకులు నాన్‌షెడ్యూల్డ్ బ్యాంకులు. షెడ్యూల్డ్ బ్యాంకులలో 32 బ్యాంకులు ఒకటి కన్నా ఎక్కువ రాష్ట్రాల్లో పనిచేస్తుండగా 22 బ్యాంకులు వాటి సొంత రాష్ట్ర పరిధిలోనే పనిచేస్తున్నాయి. నాన్‌షెడ్యూల్డ్ బ్యాంకలన్నింటిలోనూ ఆర్థిక కార్యకలాపాల రీత్యా విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ పెద్దదిగా గుర్తించబడినది.

విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు ఇతరుల అనుభవాలకు, సలహా సూచనలకు అత్యంత విలువనిస్తోంది. సభ్యుల నుండి నిరంతరం వచ్చే సూచనలను, విమర్శలను సహేతుకంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తోంది. సమాజంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పులు చేసుకుని పనిచేస్తేనే సంస్థలు మనుగడ సాగించి, ముందుకెళ్ల గలుగుతాయి. ఇది సామాజిక చలన సూత్రాలలో ముఖ్యమైన అంశం. ఈ అంశాన్ని ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సదా మనసులో ఉంచుకుని పనిచేస్తున్నది కాబట్టి ఇటీవల దశాబ్దాలలో అనేక ఆటుపోట్లను, ఆర్థిక సంక్షోభాన్ని సైతం తట్టుకుని ముందుకు సాగుతోంది. తెలుగు రాష్ట్రాలలో 101 బ్యాంకులు మాత్రమే సహకార రంగంలో పనిచేస్తుండగా, వాటిలో తెలంగాణలో 53, ఆంధ్రప్రదేశ్‌లో 48 ఉండేవి. విభజనానంతరం తెలంగాణలో రెండు బ్యాంకులు, ఆంధ్ర ప్రాంతంలో ఒకటి ఉనికిని కోల్పోగా.. తెలంగాణలో 51, ఆంధ్రలో 47 బ్యాంకులు మొత్తంగా 98 బ్యాంకులు పనిచేస్తున్నాయని సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకుగాను 12 జిల్లాల్లో వివిధ బ్యాంకులు పనిచేస్తుండగా, శ్రీకాకుళం జిల్లాలో ఇతర బ్యాంకుల శాఖలు పనిచేస్తున్నాయి. అందువల్ల అన్ని జిల్లాల్లోనూ సహకార అర్బన్ బ్యాంకుల సేవలు ఉన్నట్లు భావించవచ్చు. పోతే తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 10 నుండి 33కు పెరగడంతో 26 జిల్లాల్లో బ్యాంకులు, వాటి శాఖలు పనిచేస్తున్నాయి. ఏపీలోని 10 బ్యాంకులు 100 సంవత్సరాలకు పైబడిన వయస్సు కలిగినవి కాగా, మరో 23 బ్యాంకులు స్వాతంత్ర్యానికి ముందు నుంచి పనిచేస్తున్నవే. మిగిలిన 14 బ్యాంకులు మాత్రం 17 నుండి 50 సంవత్సరాల మధ్యకాలంలో నెలకొల్పినవే. తెలంగాణలో మాత్రం అన్ని బ్యాంకులు స్వాతంత్ర్యానంతరం ప్రారంభించినవే.

సహకార రంగంలోని మొత్తం బ్యాంకుల్లో విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు దక్షిణ భారతదేశంలోనే డిపాజిట్లు, రుణాలు, బ్రాంచీలపరంగా అతిపెద్ద బ్యాంకుగా గుర్తింపు పొందింది. తన 50 శాఖలతో అంతర్ రాష్ట్ర బ్యాంకుగా అలరారుతూ ఎన్నో ప్రయోజనకర పథకాలతో ముందుకు దూసుకెళ్తున్నది. హైదరాబాద్ కేంద్రంగా

పనిచేస్తున్న 'ది ఏపీ మహేష్ కో ఆపరేటివ్ బ్యాంకు' రెండవస్థానంలో ఉండటంతోపాటు ఉభయ రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ హోదా పొందిన ఏకైక అర్బన్ బ్యాంకుగా 5 రాష్ట్రాల్లో శాఖలను కలిగి ఉంది. ఈ రెండింటితో పాటు ఆంధ్రాబ్యాంకు (ఇటీవల యూనియన్ బ్యాంకులో విలీనమైంది) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ బ్యాంకు కూడా ఒకటికన్నా ఎక్కువ రాష్ట్రాల్లో ఉంది. బహుళ రాష్ట్రాల సహకార సంఘాల చట్టం పరిధిలో ఇది పనిచేస్తోంది. తెలంగాణలోని మిగిలిన 49 బ్యాంకులు ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం–1964 కింద రిజిస్టర్ కాబడి ప్రస్తుతం తెలంగాణ సహకార సంఘాల చట్టం కిందకు మార్పు చెందాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 5 అర్బన్ బ్యాంకులు ఏపీ పరస్పర సహాయ సహకార సంఘాల చట్టం–1995 (మ్యాక్స్) కింద రిజిస్టర్ కాగా, మిగిలిన 41 బ్యాంకులు ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం–1964 పరిధిలో పనిచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరం కో ఆపరేటివ్ బ్యాంకు తెలంగాణలోని జగిత్యాల కేంద్రంగా పనిచేస్తున్న 'ది గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు'లో విలీనం కోసం ఎదురుచూస్తున్నది.

సహకార సంఘ రంగంలో ఉన్న బ్యాంకులకు గత 118 సంవత్సరాల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాని, రిజర్వుబ్యాంకు గానీ ఎన్నడూ ఏ రకమైన ఆర్థిక సహాయం చేయలేదు. అవి కూడా వాటి నుంచి ఏ విధమైన ఆర్థిక సాయాన్ని ఆశించలేదు. కాగా బాగా పనిచేస్తున్న అర్బన్ బ్యాంకులకు గత సంవత్సరాలలో విస్తరణ అనుమతులు నిలిపివేశారు. అలాగే ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు, సంస్థలకు ఆదాయపు పన్ను రాయితీలను కల్పించి 25 శాతం పన్ను పరిధిలోకి తీసుకువచ్చి, సహకార బ్యాంకులను మాత్రం 30 శాతం పన్ను పరిధిలో కొనసాగించి వివక్షతను కొనసాగించారు. డిమాండ్ చేయగా, చేయగా 2020 బడ్జెట్‌లో దీన్ని తగ్గించారు. ఆయా రంగాల ప్రజల అవసరాలు, ఆలోచనలకు అనుగుణంగా రూపుదిద్దుకుని, సామాజిక స్పృహతో నిర్మించబడే ఐచ్ఛిక సంస్థలు ఇవి. వీటి మిగులు నిధులను లాభాలుగా పరిగణించటానికి వీలు లేదు. సహకార చట్టాలలో ఉన్న నిబంధనల ప్రకారం ప్రతి ఏడాది మిగులు నిధులలో 25 శాతం సంస్థ రిజర్వు నిధులకు జమ చేయాలి. అలానే మరో 10 శాతం నష్ట నిధులకు లేక ఇతర నిధులకు జమ చేయాలి. 1 శాతం సహకార విద్యానిధికి చెల్లించాలి. ఈ విధంగా ఏర్పాటు చేసే రిజర్వులు, సభ్యుల షేరు ధనం వంటి నిధులు కూడా సంస్థ కార్యకలాపాలలో ఉత్పాదకతను పెంచడంలో ఉపయోగపడుతున్నందున వాటి ద్వారా ప్రతి సంవత్సరం కూడా కొంత మిగులు నిధులు సమకూరుతున్నాయి. ఈ రిజర్వులు సంస్థ స్థాపించిన నాటి నుండి కొనసాగుతున్నాయి. వాటిని సంస్థ పటిష్ఠతకు మినహా ఏ విధంగానూ వినియోగించడానికి చట్టంలో అవకాశం లేదు. ఆ విధంగా సహకార వ్యవస్థ నిర్మాణంలోనే తగిన నిబంధనలు రూపొందించారు. అంటే ఇవి నేటి తరం సభ్యులకే కాకుండా భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడాలనేది సహకార వ్యవస్థ రూపకర్తల ఆశయం. సభ్యుల షేరుధనం విలువ కంపెనీల చట్టంలో మారినట్లుగా ఎన్నడూ మారదు. సభ్యులు సంస్థ నుండి వైదొలగినా, వారికి తమ షేరుధనం మాత్రమే తిరిగి చెల్లిస్తారు. అదే కంపెనీల చట్టం ప్రకారం సంస్థ ఆస్తుల విలువ, బ్రాండ్ విలువ, ఆ సంస్థ ఉత్పత్తుల భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా షేరు విలువ మారుతూ ఉంటుంది. సహకార సంస్థలలో అటువంటి అవకాశాలు లేవు. అందుచేతనే నేటికీ అనేక అభివృద్ధి చెందిన దేశాలలో సైతం సహకార సంస్థలపై ఆదాయపు పన్ను విధించడం లేదు. కానీ నేటితరంలోని మన పాలకులకు అవి వాణిజ్య సంస్థలుగా కనిపించడం వారి సామాజిక దృష్టి కోణాన్ని తెలియజేస్తున్నది. దేశవ్యాప్తంగా ఉన్న 1,482 పట్టణ, 58 బహుళ రాష్ట్రాల సహకార బ్యాంకులను రిజర్వు బ్యాంకు పరిధిలోకి తెస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సహకార రంగంలో చట్టవ్యతిరేక కలాపాలు జరిగితే చర్యలకు ఏర్పాట్లను పకడ్బందీ చేసుకోవచ్చు. కానీ ఆయా సంఘాల స్వతంత్రతకి, ఆర్థిక కార్యక్రమాల నిర్వహణకు, విస్తరణకు మాత్రం పాలకులు ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుపడకూడదు.

**(జులై - ప్రపంచ సహకార దినోత్సవం)**

## సహకార భీమసింగిని ప్రభుత్వం పట్టాలెక్కించాలి





విజయనగరం జిల్లాలో ఎంతో కీలకమైన భీమసింగి సహకార చక్కెర కర్మాగారం దీనస్థితిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటనే స్పందించాలని బాబ్జీ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీకి నిధుల్ని మంజూరు చేయాలని కర్మాగారం ప్రధాన గేటు వద్ద రైతులతో కలిసి నిరసన ధర్నా చేశారు. 45 సంవత్సరాలుగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఫ్యాక్టరీ గానుగ ఆడేదని, ఈ ఏడాది అనిశ్చితి తీవ్రంగా ఉందని అన్నారు. చెరకు రైతులకు రూ.8.30 కోట్లు చెల్లింపులు జరగాలని, కార్మికులకు 4 నెలల జీతాలివ్వాలని అన్నారు. ఫ్యాక్టరీ నడవటానికి రూ.5 కోట్ల సాయం కావాలన్నారు. కర్మాగారం పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలు, మంత్రి అవంతి ఉన్నా పట్టించుకోవటం లేదన్నారు. ఫ్యాక్టరీకి చైర్మన్‌గా ఉన్న కలెక్టర్‌సహా అందరూ కలిసి కృషి చేసి కర్మాగారాన్ని తిరిగి పట్టాలెక్కించాలన్నారు. దీని మీద రాజకీయాలకతీతంగా రైతు ఉద్యమాన్ని లోక్‌సత్తా చేపడుతుందన్నారు. సుగర్స్ ఎండీ విక్టర్‌రాజుకి డిమాండ్ల పత్రం అందించారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా నాయకులు నాగభూషణం, బైరాగి సత్యనారాయణ, పొలుపర్తి అప్పలసత్యం, వి.బాబ్జీ, గార పెంటయ్య, తాత్రాజు రాజారావు, బోర రమేష్, కర్రి నాగేశ్వరరావు, సంతోష్ కుమార్, ఎ.సుధీర్, కాళ్ల శ్రీను, భాస్కర్, పొలుపర్తి అప్పారావు, కర్మాగార కార్మికుల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

# బలమైన సహకార రంగం - భారతదేశ సమస్యలకు పెద్ద పరిష్కారం!

భారతదేశంలో సహకార రంగం విజయం సాధిస్తే వ్యవసాయం, ఉపాధి అవకాశాలు, ప్రజా స్వామ్యం మెరుగుపడటం వంటి గణనీయ మార్పులు చోటుచేసుకుంటాయని, అందువల్లే లోక్‌సత్తా కృషి వల్ల వచ్చిన 97వ రాజ్యాంగ సవరణను చరిత్రాత్మక సవరణగా తాను తరచూ అభివర్ణిస్తుంటానని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రభుత్వాల అనుచిత జోక్యం లేకుండా ప్రజలు తమంతట తాము సంఘాలుగా ఏర్పడి ఆర్థిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహించుకునే స్వేచ్ఛను ఈ రాజ్యాంగ సవరణ పరిరక్షిస్తుం దన్నారు. తాను రాసిన రాజ్యాంగ సవరణకు కొందరు భేషజాలకు పోయి అనవసర పదాల్ని జోడిం చటం వల్ల ఇంకా కొన్ని చిన్న చిన్న సమస్యలు కొనసాగుతున్నాయని, అయితే మొత్తంగా సహకార సంఘాల స్వయంప్రతిపత్తికై 97వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్యారంటీ లభించిందన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) సంస్థ నిర్వహిస్తున్న డిప్లొమా ఇన్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ శిక్షణా తరగతుల్లో జేపీ దిశానిర్దేశం చేశారు. సహకార సంఘాల్లో నేరపూరిత చర్యలు ఉంటే తప్ప ప్రభుత్వాలు జోక్యం చేసుకోకూడదని, అయితే పక్షపాత, దోపిడీ రాజకీయాల కోసం వాటిని నాశనం చేయటానికి ప్రతి ప్రభుత్వమూ ప్రయత్నిస్తూనే ఉందని జేపీ అన్నారు. పలుమార్లు న్యాయస్థానాల దాకా వెళ్లి ప్రభుత్వాల పెత్తందారీ ధోరణుల్ని లోక్‌సత్తా అడ్డుకుందన్నారు (తన జీవితంలోని ముగ్గురు హీరోలలో ఒకరైన డా॥ వర్గీస్ కురియన్ స్ఫూర్తితో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ (అప్పట్లో ఉన్నతాధికారిగా ఉన్నారు) చొరవతో 1995లో ఎన్.టి రామారావు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టాన్ని నీరుగార్చేందుకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ప్రయత్నించాయి. దీనిపై లోక్‌సత్తా ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు దాకా న్యాయపోరాటాలు జరిగాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వాలు వెనక్కు తగ్గాయి. చిత్తూరు, కడప డెయిరీలను నాశనం చేసిన చంద్రబాబు, వైఎస్సార్‌ల బాటలోనే తెలంగాణ ప్రభుత్వం 2016లో జీవో 28ని జారీ చేసినా 97వ రాజ్యాంగ సవరణ ద్వారా లోక్‌సత్తా చేసిన ప్రయత్నంతో జీవోను పక్కనపెట్టింది). 97వ రాజ్యాంగ సవరణ ఇచ్చిన దన్నుకు తోడు.. సహకార సంఘాలు కూడా నిజాయతీ, సమర్థతతో కూడిన పరిపాలనా సేవల్ని అందిస్తేనే డిపాజిటర్లకు, ప్రజలకు ఫలితాలు అందుతాయని, ఆర్థిక స్వావలంబన సమకూరుతుందని అన్నారు. సహకార భావన విలువ అర్థంకాకుండా సాంప్రదాయ రాజకీయ ధోరణులకు లోనై పనిచేస్తుండటం, పేరాశ వల్లే చాలా సహకార సంఘాలు నష్టాలకు, ఒడిదుడుకులకు లోనవుతున్నాయని జేపీ అన్నారు. సహకార వ్యవస్థకి, ప్రజాస్వామ్యానికి, జనహితానికి మధ్య సంబంధం అర్థమైన నాయకత్వం అందిన ప్రతి చోటా ఈ సంఘాలు అద్భుత ఫలితాల్ని సాధించాయన్నారు. ముఖ్యంగా సంక్షోభంలో ఉన్న వ్యవసాయానికి ఇవి పెద్ద అండనందించాయన్నారు. సహకార సంఘాల ఎన్నికల నిర్వహణ వంటి వాటిలో పార్టీ రాజకీయాలప్రభావం లేకుండా ఏర్పాట్ల అవసరముందని జేపీ అన్నారు. అధికారులు, ఇతర ఉద్యోగులు అవగాహనతో, అంకితభావంతో విధుల్ని నిర్వర్తించాలని, ప్రభుత్వాలు తాత్కాలిక తాయిలాల ధోరణిని వీడి సహకార వ్యవస్థల బలోపేతం వంటి సంస్కరణలతో ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీఎం డైరెక్టర్ హెచ్.ఎస్ తంగిరాల, డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






Gandhi@150

**"ఈ దేశంలో చిట్టచివరన ఉన్న పౌరునికి కూడా తన జీవితం మీద తనకు సాధికారతను, తన బతుకుకు తానే యజమానిననే విశ్వాసాన్ని కలిగించినప్పుడే స్వరాజ్యం వచ్చినట్లు"**

**- మహాత్మాగాంధీ**

## పెట్టిన ప్రతి రూపాయి ప్రజాధనానికీ అనేక రెట్లు

# లాభం వచ్చేలా ప్రాజెక్టుల్ని కట్టిన సర్ ఆర్థర్ కాటన్

### - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

సర్ ఆర్థర్ కాటన్ తన జీవితకాలంలో చేసిన గొప్ప కృషి వల్లో, ఆయన సాధించిన విజయాలు ఇప్పటికీ అద్భుతాల్లానే నిలిచి ఉండటం వల్లో, వాటిలో అడుగడుగునా జనహితం నిండి ఉండటం వల్లో.. ఆయనపై రూపొందించిన ఈ చిన్న పుస్తకం కూడా ఓ గొప్ప కావ్యాన్ని సందర్శించిన అనుభూతిని కలిగిస్తుంది. స్థల, కాలాది పరిమితుల్ని దాటి ఎప్పటికీ ఆనందాన్ని కలిగించే వ్యక్తి జీవితాన్ని మించిన గొప్ప కావ్యం ఏముంటుంది మరి! ఆయన జీవిత విశేషాల్ని ఎంతో ఉద్వేగం, ఆర్ద్రత నిండిన పుస్తకరూపంలో అందించిన సర్ ఆర్థర్ కాటన్ మెమోరియల్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్.బి చౌదరిగారికి ముందుగా అభినందనలు.

ఆర్థర్ థామస్ కాటన్ అనగానే.. నా ఐఏఎస్ ఉద్యోగ అనుభవాలు కొన్ని అప్రయత్నంగా కళ్ల ముందు మెదులుతాయి. ప్రజాప్రయోజనాల కోసమే అయినా పైవారి నుంచి, పాలకుల నుంచి అనుమతులు తెచ్చుకోవటానికి పడ్డ సవాలక్ష కష్టాలు, అవమానాలు సహా పలు ఉదంతాలు గుర్తుకొస్తాయి. వాటిల్లో నీటి పారుదల రంగానికి సంబంధించిన రెండు అనుభవాల్ని మాత్రం ఇక్కడ పంచుకుంటాను.



1989 ప్రాంతంలో నేను తూర్పు గోదావరి జిల్లా కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించినప్పుడు జరిగిన ఉదంతమిది. ఆ రోజులలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి, నగరానికి నీటి సరఫరా కోసం ప్రారంభించిన ఏలేరు రిజర్వాయరు పూర్తవుతోంది. దాంతో ఏలేరు నీటితో సాగయ్యే దిగువ భూములకు సేద్యపు నీరు లేకుండా పోయింది. ప్రభుత్వం అందుకు ప్రత్యామ్నాయంగా సామర్లకోట కాల్వను పొడిగించి పిఠాపురం బ్రాంచి కాల్వ పేరుతో గోదావరి జలాలను ఏలేరు ఆయకట్టు కింది ప్రాంతాలకు అందించే పథకాన్ని చేపట్టింది. ఏలేరు నీరు ఆగిపోయే సమయానికి పిఠాపురం కాల్వ పూర్తయి పంటలకు నీరు అందాలన్న ఉద్దేశంతో కాల్వ పని సకాలంలో పూర్తయ్యేందుకు చేపట్టే చర్యలను సమీక్షిస్తున్నాం. ఉన్నతస్థాయి ఇంజినీరు ఒకాయన కాల్వ మట్టిపని అంతా పూర్తవుతుందని, అయితే పశ్చిమ ఏలేరు డ్రెయిన్ మీద అక్విడక్టు (సాగుకాలువ ప్రవహించే వంతెన) పూర్తి కావటం కష్టమని, అది కనీసం రెండు సీజన్ల పని అని వివరించారు. అప్పటికి దాదాపు 140 సంవత్సరాల క్రితం కాటన్ మహాశయుడి పర్యవేక్షణలో వైనతేయ గోదావరి మీద 600 మీటర్లకి పైగా పొడవున్న గన్నవరం అక్విడక్టును (రాజోలు ప్రాంతానికి సాగునీటిని అందజేసే వంతెన) కేవలం ఒక పని సీజనులో ఆరు నెలల్లో పూర్తి చేశారు! గోదావరిలో ఆరు నెలలు వరదల వల్ల వంతెన పని సాధ్యం కాదు. మిగిలిన రోజుల్లో కూడా సముద్రం పోటు నీరు తల లోతుంటుంది. అది అన్ని పక్కల గోదావరి నది ఉన్న ద్వీపం. ఇటుకలకు కావలసిన మట్టి స్థానికంగా దొరకదు. నైపుణ్యం గల పనివాళ్లు లేరు. ఆ రోజుల్లో కోనసీమ ప్రాంతానికి రైళ్లు గాని, రోడ్లు గాని లేవు. కార్మికులు, అధికారులు, ఇటుకలు, ఇతర సామాగ్రి। అంతా నావల మీద అవతలి గట్టుకి చేరాల్సిందే. సరైన రవాణా లేదు, విద్యుత్తు లేదు, ఆధునిక సాంకేతిక విజ్ఞానం లేదు, టెలిఫోన్లు లేవు. ఇన్ని అడ్డంకులున్నా వలస పాలన కాలంలో ఓ అధికారి గోదావరి మీద వంతెనను ఓ సంవత్సరం లోపల పూర్తి చేయగలిగారు. అదే ఈ రోజులలో ఒక మురుగు కాల్వ మీద వంతెన నిర్మాణానికి కనీసం రెండు సీజన్లు కావాలని స్వతంత్ర భారతంలో మన అధికారులు అభిప్రాయపడుతున్నారు.. ఇవే మాటల్ని సమావేశంలో చెప్పాను. చివరికి ఎలాగోలా సకాలంలో పని ముగిసిందనుకోండి. ఇదీ కాటన్ స్థాయి! ఈ స్థాయిలో మన అధికారులు పనిచేస్తే పోలవరం ఎప్పుడో పూర్తయ్యేది, రాష్ట్ర విభజన జరిగి ఆరేళ్లవుతున్నా తెలంగాణ, నూతన ఆంధ్రప్రదేశ్ మధ్య ఇప్పటికీ పరిష్కారంకాని ఉద్యోగులు, ఆస్తులు, అప్పుల విభజన సహా వంటి సమస్యలన్నీ 2014లోనే ఒక్క వారం

రోజుల్లోనే పరిష్కారమైపోయేవి.

ఇక రెండోది, 1986 ప్రాంతంలో ప్రకాశం జిల్లాలో నేను కలెక్టర్‌గా ఉన్నప్పటిది. అనావృష్టికి గురవుతూ విలవిల లాడుతున్న ప్రాంతాల్లో రైతులు ఆ సమయంలో స్వయంగా వందలకొద్దీ ఎత్తిపోతల పథకాలను, వేల సంఖ్యలో గొట్టపు బావులను ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ ప్రభుత్వం చేసిందల్లా అతి స్వల్పం, అన్ని జిల్లాలతోపాటు గ్రామీణ క్రాంతిపథం పేరుతో ప్రజలకు పనికివచ్చే పథకాలకు సగం సబ్సిడీ ప్రకటించారు. పాలనా యంత్రాంగం ప్రత్యేకంగా చేసిన కృషి కూడా స్వల్పమే. కేవలం అడ్డంకులను తొలగించటం మాత్రమే జరిగింది. నీటి వనరులున్న చోట రైతులు భూమిని తనఖా పెట్టి సగం డబ్బు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని ఖర్చు చేయటానికి సిద్ధపడితే వారికి ఎత్తిపోతల పథకం మంజూరు చేస్తామని హామీనివ్వటం జరిగింది. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఇంజినీర్లలో ఎవరు దాన్ని అమలు చేయాలో నిర్ణయించుకునే అవకాశం కొన్ని పరిమితుల మేరకు రైతులకు కల్పించాం. వీలున చోట స్వయంగా రైతులే అమలు చేసుకునే అవకాశాన్ని కల్పించటం జరిగింది. ఆ పథకాల నిర్వహణ బాధ్యత మొత్తం రైతులదే. అంతే! ఆ మాత్రం వెసులుబాటు కల్పించగానే దాదాపు రెండు లక్షల ఎకరాలకు నీటి వసతిని కల్పించే 450కి పైగా ఎత్తిపోతల పథకాలను, 3800 గొట్టపుబావులను రైతులు చేపట్టారు. రాష్ట్రం మొత్తంలో 20 సంవత్సరాలలో ఎత్తిపోతల పథకాలలో కల్పించిన నీటి వసతికి సమానమైన విస్తీర్ణంలో ఒక్క రెండున్నర సంవత్సరాలలో ప్రకాశం జిల్లాలో రైతులు సాగునీరు సాధించారు. ఇలా అన్ని పథకాలు కలిపి రూ.43 కోట్లతో దాదాపు రెండు లక్షల ఎకరాలకు నీటి వసతి ఏర్పాట్లు జరిగాయి. దీనివల్ల ఆ ప్రాంతాలలో దాదాపు లక్ష కుటుంబాలకు ఆదాయం పెరగటంతోపాటు గ్రామీణ నిరుద్యోగం అంతరించింది. ఆర్థర్ కాటన్ మహాశయుడి తర్వాత అంత తక్కువ ఖర్చుతో అంత పెద్దఎత్తున నీటివసతిని కల్పించిన కార్యక్రమం యావత్ భారతదేశంలోనే లేదనవచ్చు. ఇలాంటి చరిత్రాత్మక కార్యక్రమం కలెక్టర్‌గా నా నేతృత్వంలో జరగటం నాకు లభించిన ఓ గొప్ప అవకాశంగా భావిస్తుంటాను. పెట్టే ప్రతి రూపాయికీ అనేక రెట్లు విలువ చేకూర్చే విధానాలతో, ప్రజల భాగస్వామ్యంతో ఈ దేశ వనరులను సద్వినియోగం చేస్తే ఎలాంటి అద్భుతాలు చేయవచ్చో ఈ అనుభవం, ఎప్పుడో శతాబ్దకాలం కంటే కూడా ముందు కాటన్ చేసిన కృషి నిలువెత్తు నిదర్శనాల్లా మన అధికారులకు, పాలకులకు, సమాజానికి తెలియ చేస్తుంటాయి.

ఆర్థర్ కాటన్‌కు రాష్ట్రాలు, దేశాలు, మత విశ్వాసాలు వంటి ఎల్లలు లేవు. భారతదేశంలో పాలన అంటే భారతీయుల బతుకుల్ని బాగుచేయటం అని తోటి వలసపాలకులు, అధికారులతో వాదించి, తన హేతుబద్ధ లెక్కలతో ఒప్పించి, తన ప్రతిష్ఠను పణంగా పెట్టి మరీ దక్షిణ భారతంలో ప్రాజెక్టుల్ని సాధించారు. దేశమంటే మట్టి కాదు మనుషులు అని మన మహాకవి గురజాడ పాడటానికి ఎంతో ముందే ఆ దిశగా అడుగుజాడను అందించారు. అప్పట్లో పెద్దగా మందులు లేని వ్యాధి బారినపడ్డా కాటన్ గారు కోలుకుని తిరిగి ఇండియాకు రావటం ముఖ్యంగా తెలుగువారి అదృష్టం.


కాటన్‌పై పుస్తకాన్ని రాజమహేంద్రవరంలో ఆవిష్కరిస్తున్న సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, బీవీ పట్టాభిరాం తదితరులుల

గుర్రం మీద కాటన్ దొర ఉన్న విగ్రహాలు గోదావరి, మరికొన్ని కోస్తా జిల్లాల్లో వేలాదిగా కనిపిస్తాయి. కానీ ఏ విగ్రహాల్లో మనకు మన సమాజానికి అలవాటైన ఆభిజాత్యం కనిపించదు, అధికార పీఠాన్ని చెలాయించే మన నేతల్లో కనిపించే పెత్తందారీతనం కనిపించదు. పరిజ్ఞానం, నైపుణ్యం, ముందుచూపుతో జనహితం కోసం కంకణబద్ధుడైన ఓ మహనీయుడు తన విధినిర్వహణ కోసం ఓ వాహనాన్ని అధిరోహించిన తేజోమయ దృశ్యంలా ఆయన విగ్రహాలు ఉంటాయి. సంపూర్ణ మానవుడిలో, కష్టజీవిలో ఉండే ఠీవి, సౌందర్యం, స్ఫూర్తిమంతత ఆయనలో ఉట్టిపడుతుంటాయి. తాను విశ్వసించే క్రైస్తవంలోని ఉదాత్త గుణాలను మాటలకి పరిమితం చేయకుండా చేతల్లో చూపారాయన. ప్రజల డబ్బును పవిత్రంగా భావించి బాధ్యతతో ఖర్చు చేయటం, వ్యక్తి సుఖాన్ని సమాజ హితంతో అనుసంధానం చేయటం వంటివి ఆయనలో పెంపొందటానికి ఆధ్యాత్మిక నేపథ్యం కూడా దోహద పడింది.

పెట్టిన ప్రతి రూపాయికీ అనేక రెట్లు లాభం వచ్చేలా కాటన్ మహాశయుడు ఎలా ప్రాజెక్టులను నిర్మించారో, జలరవాణాకు ఎలాంటి ఆలోచనలు చేశారో పుస్తకంలో స్థూలంగా చెప్పారు. ఆర్థర్ కాటన్ నిజాయతీ వ్యక్తిగతానికే పరిమితం కాకుండా ఇలా వ్యవస్థ చుట్టూ తిరగటం వల్లే ఆయన పుట్టి 200 ఏళ్లు దాటినా ఆయన గురించి ఇప్పటికీ మాట్లాడుకుంటున్నాం. కెరీర్‌లో, జీవితంలో గెలవాలని, సమాజం కోసం ఎంతోకొంత చేసి తమకంటూ గుర్తింపు తెచ్చుకోవాలని కోరుకుంటున్న యువత ఏ రంగంలో ఉన్నా ఆర్థర్ కాటన్‌ను రోల్‌మోడల్‌గా తీసుకోవాలని, ఆలోచనలో, కృషిలో ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరుతూ.. ఈ చర్చకు దోహదం చేసిన ఎస్.బి చౌదరిగారికి, సర్ ఆర్థర్ కాటన్ మెమోరియల్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్ కార్యదర్శి మొహమ్మద్ ఖాదర్‌ఖాన్‌గారికి అందరి తరపునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**('అపర భగీరథుడు- సర్ ఆర్థర్ కాటన్' పుస్తకానికి జేపీ ముందుమాట)**

# నియంత్రితంకన్నా.. ప్రోత్సాహకాల విధానం మేలు: లోక్‌సత్తా



## రైతు క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచన

మౌలిక సదుపాయాలు కల్పించకుండా, భూసార పరీక్షలు చేయకుండా, సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన పంటలు వేస్తేనే రైతుబంధు నిధులు మంజూరు చేస్తామని బెదిరించటం సన్నకారు రైతుల మనోధైర్యాన్ని దెబ్బతీయటమేనని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ అన్నారు. చిన్న కమతాలు పెద్దసంఖ్యలో ఉండటం వల్ల ప్రభుత్వాదేశాలు అమలవటం కూడా కష్టమవుతుందన్నారు. మరోపక్క మార్కెట్‌ని ప్రభుత్వం నియంత్రించలేదన్నారు. ఫలానా పంటకు లాభం వస్తుందని ప్రభుత్వం కూడా గ్యారంటీగా చెప్పలేదన్నారు. ఆహార భద్రత పరిమితిని దాటి ప్రభుత్వమే మార్కెట్ శక్తిగా వ్యవహరించటం మన దేశంలాంటి చోట వ్యవసాయేతర సమాజం మీద మోయలేని భారంగా మారుతుందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు భూసారం, విత్తనాల దగ్గర్నుంచి సరైన సమాచారమిచ్చేందుకు వ్యవసాయాధికారి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేయటం, మార్కెట్‌లో డిమాండ్ లేకున్నా ఎక్కువ నీటిని వినియోగించే పంటలు వేయటాన్ని నిరుత్సాహపరచటం, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు ప్రోత్సాహకాలనివ్వటం వంటి చర్యల్ని చేపట్టాలన్నారు. రైతులు తమ ఉత్పత్తులను ఆంక్షల్లేకుండా దేశంలో ఎక్కడైనా అమ్ముకోవచ్చని కరోనా నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ మార్కెట్ చట్టాన్ని రైతులు సమష్టిగా సద్వినియోగం చేసుకునేలా గ్రామాన్ని లేదా 2,500 ఎకరాల భూమి చొప్పున యూనిట్‌గా తీసుకుని రైతు క్లబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

### కరోనాపై స్థానిక నిర్ణయాలుండాలి

కరోనా (కొవిడ్-19)ను ఎదుర్కోవటంలో పాలకులకు ప్రణాళిక కొరవడటం, అంచనా పరీక్షల్ని తగిన సంఖ్యలో నిర్వహించక పోవటం వల్ల తెలంగాణలో కరోనాపై పోరు ప్రజలకు విపరీత భారంగా మారిందని తుమ్మనపల్లి శ్రీనివాస్ అన్నారు. చికిత్సను వికేంద్రీకరించి స్థానికంగా ఎక్కడికక్కడ వైద్యసేవల్ని అందించాలని డిమాండ్ చేశారు. కేసులు ఇంకా పెరుగుతాయని అంచనా వేస్తున్నారని, వైద్యసిబ్బందిని రాజధాని అవసరాలకు ఎక్కువగా తరలించటం వల్ల గ్రామాల్లో కొవిడ్, ఇతర ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యే అవకాశముందన్నారు. రాష్ట్రమంతటినీ ఒకే యూనిట్‌గా చూడకుండా స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయాలు ఉంటే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. అందువల్ల స్థానిక ప్రభుత్వాలకు మరిన్ని నిధుల్ని, అధికారాల్ని ఇవ్వాలన్నారు. గ్రామీణ ఆరోగ్యాన్ని శాశ్వతంగా బాగుచేసేలా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పటిష్ట ప్రజారోగ్య వ్యవస్థను తీసుకురావాలన్నారు. రాష్ట్ర బడ్జెట్ పరిధిలోనే దీన్ని అమలు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వానికి లోక్‌సత్తా నివేదిక ఇచ్చిందన్నారు.

✦ రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణమవుతున్న, పూర్తయిన సాగునీటి ప్రాజెక్టులలో భూనిర్వాసితుల త్యాగం ఎంతో ఉందని తుమ్మనపల్లి అన్నారు. కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు పూర్తికావటానికి వారెంతో సహకరించారన్నారు. భూనిర్వాసితుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. వారికి ప్రభుత్వం చెల్లించిన పరిహారం చాలా తక్కువని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి భూసేకరణ చట్టం-2013 ప్రకారం చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్‌లు ప్రారంభమైన కొద్దిరోజులకే గండి ఏర్పడటం, కాలువకు పగుళ్లురావటం నిర్మాణ పనుల్లో లోపాలను తేటతెల్లం చేస్తున్నాయన్నారు. ఇంతకుముందు కూడా వేల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ప్రాజెక్టులలో నాణ్యతా లోపాలపై వార్తలు వచ్చినప్పుడు అధికారులు, పాలకులు నోరు మెదపకపోవటం విచిత్రంగా ఉందన్నారు. వీటిపై సమగ్ర విచారణజరిపి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

✦ విభజన చట్టంలోని నిబంధనలను తుంగలో తొక్కి అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా, కృష్ణా నీటి యాజమాన్య బోర్డు వద్ద నీటి వాటా తేలకుండానే, జాతీయ జలవిధానాన్ని సైతం ధిక్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా శ్రీశైలం నుంచి నీటిని తరలించడానికి కొత్త ఎత్తిపోతల చేపట్టటం అనుచితమని, దీనిపై చేతులు కాలాకైనా ఆకులు పట్టుకోవాలా వద్దా అన్నట్లు తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తోందని తుమ్మనపల్లి శ్రీనివాస్ అన్నారు. చూస్తుంటే, రెండు రాష్ట్రాల పాలకుల మధ్య రహస్య ఒప్పందమున్నట్లు కనిపిస్తోందన్నారు. పార్టీ రాజకీయావసరాల కోసం తెలంగాణ ప్రయోజనాల్ని కాలరాసే ప్రయత్నం దారుణమన్నారు. తెలంగాణ ప్రభుత్వం సకాలంలో చర్యలు చేపట్టకపోతే, ఈ ప్రాజెక్టు వల్ల నాగార్జునసాగర్ ఎడమ కాలువ, కల్వకుర్తి ఎత్తిపోతల, పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల, డిండి ఎత్తిపోతల, శ్రీశైలం ఎడమగట్టు కింద ఉన్న విద్యుత్ కేంద్రాలకు నష్టం కలిగే ప్రమాదముందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని సాగునీటి అవసరాలకు, మిషన్ భగీరథకు కూడా నష్టం వాటిల్లుతుందన్నారు.

# 2019-20లో ఏపీ తలసరి ఆదాయం రూ.1,69,519

రైతులు, నిరుపేదల సంక్షేమానికి కేటాయింపుల్లో ప్రాధాన్యమివ్వనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. నవరత్నాల అమల్లో భాగంగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా వారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు '2019-20 సామాజిక, ఆర్థిక సర్వే'లో వివరించింది.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి.. ప్రస్తుత ధరల ప్రకారం 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.9,72,782 కోట్లుగా అంచనా వేశారు. గతేడాది కంటే 12.73 శాతం వృద్ధి నమోదవుతుందని భావిస్తున్నారు.

- స్థిర ధరల ప్రకారం 2019-20లో రాష్ట్ర వృద్ధిని 8.16%గా అంచనా వేశారు. ఇదే కాలంలో జాతీయ స్థాయి వృద్ధి రేటు 5 శాతంగా సర్వేలో పేర్కొన్నారు.
- 2019-20లో ముందస్తు అంచనాల ప్రకారం వ్యవసాయ రంగ స్థూల అదనపు విలువ (జీవీఏ)లో 18.96 శాతం, ఉద్యానంలో 11.67%, పశుసంవర్థకంలో 4.53 శాతం వృద్ధి నమోదైంది.
- పారిశ్రామిక రంగంలో (2011-12 స్థిర ధరల ప్రకారం).. 5.67 శాతం వృద్ధిని అంచనా వేశారు.
- సేవారంగంలో 9.11% వృద్ధి సూచనలు కన్పిస్తున్నట్లు తెలిపారు.
- 2019-20లో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,69,519 అని పేర్కొన్నారు. జాతీయ తలసరి ఆదాయం కంటే ఇది రూ.35,087 ఎక్కువ. 2018-19తో (రూ.1,34,432) పోలిస్తే 12.14% వృద్ధిని అంచనా వేశారు.

## 15,004 గ్రామ/వార్డు సచివాలయాలు

అట్టడుగు స్థాయి వరకు సేవలందించేందుకు వీలుగా గ్రామ/వార్డు స్థాయిలో 15,004 సచివాలయాల్లో 1,18,509 మంది వివిధ శాఖలకు చెందిన సిబ్బంది, 2,61,216 మంది వాలంటీర్ల నియామకం. 541 సేవల అందచేత. పారదర్శక పౌరసేవలు అందించేందుకు 'స్పందన' అమలు, ఫిర్యాదులకు 72 గంటల్లో పరిష్కారం.

## పరిశ్రమల ఏర్పాటుతో 1.17 లక్షల మందికి ఉపాధి

కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నుంచి వాణిజ్య విమానాల సేవలు త్వరలో ప్రారంభంకానున్నాయి. మచిలీపట్నం, భావనపాడు, కాకినాడ సెజ్, రామాయపట్నం ఓడరేవుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాష్ట్రంలో రూ.18,691 కోట్ల పెట్టుబడుల ద్వారా 1.10 లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చినట్లు సర్వేలో ప్రభుత్వం వివరించింది. ఎలక్ట్రానిక్స్ రంగంలో 30,656 కోట్ల పెట్టుబడులతో 1.07 లక్షల మంది ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో 25 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

- నవరత్నాల అమలులో భాగంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్దను ప్రస్తావించారు.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో 2.70 లక్షలమందికి ప్రయోజనం.
- వైఎస్సార్ కంటివెలుగులో 60,406 పాఠశాలల్లోని 66 లక్షలమంది పిల్లలకు కంటి పరీక్షలు.

### రంగాలవారీగా స్థూల ఉత్పత్తి
### (ముందస్తు అంచనాలు.. రూ.కోట్లలో)

| | ప్రస్తుత ధరల ప్రకారం | స్థిర ధరల ప్రకారం |
|---|---|---|
| వ్యవసాయం | 3,20,218 | 1,86,393 |
| పారిశ్రామికం | 1,91,857 | 1,54,627 |
| సేవలు | 3,67,747 | 2,62,772 |

- 2019-20లో 54.68 లక్షల మందికి పింఛన్లు. ఏడాదికి రూ.15,635 కోట్లు కేటాయింపు. 2020-21లో ఈ పథకానికి కేటాయింపులు రూ.18 వేల కోట్లకు పెంపు.
- 10,641 వైఎస్సార్ ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల సరఫరా.
- 2019 ఖరీఫ్‌లో 21.53 లక్షల మంది రైతులకు ఉచిత పంటల బీమా.. రూ.1,270 కోట్ల ప్రీమియం చెల్లింపు.
- ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.7 లక్షల ఆర్థిక సాయం. మత్స్యకార కుటుంబాలకు రూ.10 లక్షల సాయం.
- జలయజ్ఞంలోని ప్రాజెక్టుల పూర్తికి కార్యాచరణ.
- వైఎస్సార్ చేయూతలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మహిళలకు రూ.75 వేల ఆర్థికసాయం.
- వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా 81,779 కుటుంబాలకు

ఏడాదికి రూ.24 వేల చొప్పున రూ.196.27 కోట్ల చెల్లింపు.

- వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా 2.62 లక్షల మంది ఆటో, క్యాబ్ యజమానులకు ఏడాదికి రూ.10,000 చెల్లింపు.

### ఆదాయం లేకుండా సంక్షేమం ఎలా సాధ్యం?

ఆదాయంలేకుండా, అవసరమైన మౌలిక రంగాలకు తగిన కేటాయింపులు లేకుండా సంక్షేమం పేరుతో పథకాలకు విచ్చలవిడిగా ఖర్చును పెంచుకుంటూ పోయే ప్రమాదకర పాలన రాష్ట్రంలో జరుగుతోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఆదాయం లేకుండా సంక్షేమం సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్-2020-21పై ఆయన విజయనగరంలో మీడియాతో మాట్లాడారు. తాగు, సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో ప్రభుత్వం విఫలమైందన్నారు. బాబూజగ్జీవన్‌రాం ఉత్తరాంధ్ర సుజల స్రవంతితోపాటు అనేక ప్రాజెక్టులు ఉత్సవవిగ్రహాల్లా ఎదురుచూస్తున్నాయన్నారు. చైనా సరిహద్దుల వద్ద పోరాడి ప్రాణాలర్పించిన భారత వీరసైనికులకు ఆయన నివాళులర్పించారు.





# ఉపాధిహామీ పట్ల ఇద్దరికీ ఎగతాళే.. వ్యవసాయానికి సంధానం చేయాలి: లోక్‌సత్తా

రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని, లెక్కల కోసం అధికారులు పనిచేస్తుంటే.. కష్టపడకుండానే సొమ్ములొస్తున్నాయని వేతనదారుల్లో ఎక్కువమంది పనికి వస్తున్నారని భీశెట్టి అన్నారు. పనిచేసేవారు, చేయిస్తున్నవారూ ఇద్దరూ ఉపాధి హామీ పనుల పట్ల ఎగతాళిగానే ఉన్నారన్నారు. ఉపాధి పనులకు విలువ పెరిగి, ప్రభుత్వం పెడుతున్న ఖర్చు సద్వినియోగం కావాలంటే.. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్నారు. గ్రామీణ ఉపాధి పనుల్ని వ్యవసాయానికి అనుసంధానం చేయకపోతే రానున్న రోజుల్లో వ్యవసాయం ఇంకా భారంగా తయారవుతుందన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయం చేయటానికి రైతులుండరన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో, దేశంలో రైతులు కాడీ, మేడీ పారేస్తున్నారన్నారు. రైతులు కూలీలవుతుంటే, కూలీలుగా ఉన్నవారు పొట్టచేత పట్టుకుని నగరాలకు వలస పోవటానికి చూస్తున్నారన్నారు. విజయనగరం జిల్లాలోని డెంకాడ, విజయనగరం, బొండపల్లి మండలాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. వ్యవసాయంలో న్యాయమైన ఆదాయం వచ్చే సంస్కరణల్ని తీసుకొస్తే, రైతులు, కౌలురైతులు కూడా తేరుకోగలుగుతారన్నారు.

ఉపాధి హామీని వ్యవసాయానికి సంధానం చేయటం, నిల్వ, మార్కెట్ సదుపాయాల్ని భారీగా విస్తరించటం, చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటం, రైతులకపిల్లలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం వంటివి చేస్తే తప్ప గ్రామాలను బాగు చేసి ఉపాధి కేంద్రాలుగా తీర్చిదిద్దలేరని బాబ్జీ అన్నారు.

# ప్రజలకు స్వావలంబన ఎందుకు?

## అప్పులే ఆసరాగా సర్కారీ భరోసా పథకాలకు భారీ పెంపుతో ఏపీ బడ్జెట్

"ప్రభుత్వాలు ఎన్ని ఉచితాల నిచ్చినా.. ఉపాధి ద్వారా ప్రజలకు వచ్చే ఆదాయా నికి, అవకాశాలకు అవి సాటిరావని" కొవిడ్ కల్లోలం కూడా పట్టి మరీ పాఠం చెబుతున్నా.. ప్రజానీకానికి స్వావలంబన కన్నా సర్కారీ భరోసా కల్పించటానికే ప్రాధాన్య మిస్తూ సంక్షేమం పేరుతో నేరుగా లబ్ధిదారులకు అమలయ్యే వివిధ పథకాలకు 193 శాతం పెంపుతో (6.20 శాతం నుంచి 18.44 శాతానికి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2020-21 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక మందగమనం, రెవెన్యూలోటు వంటి సమస్యలకు కరోనా లాక్‌డౌన్ తోడవటాన్ని ఎదుర్కొనేందుకు అప్పుల్నే ఆసరాగా చేసుకుంది. రైతులు, డ్రైవర్లు, విద్యార్థులు, చేనేత కార్మికులు, మహిళలు, మత్స్యకారులు.. ఇలా సమాజం లోని వివిధ వర్గాల లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా బదిలీ చేసే 18 పథకాలకు కేటాయింపుల్ని తాజా బడ్జెట్‌లో పెంచారు. సంక్షే మ రంగానికి 2019-20 బడ్జెట్‌లో రూ.14,142.99 కోట్లు కేటాయించగా, ఇప్పుడవి రూ.41,456.29 కోట్లకు పెరిగాయి.

రూ.2,24,789.18 కోట్ల అంచనాలతో ఏపీ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శాసనసభ రెండురోజుల సమావేశాల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అంతకుముందు ఏడాది రూ.2,25,975 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంచనాలు 1.4% మేర తగ్గాయి. నూతన ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించాక ప్రతి బడ్జెట్‌లోనూ 15 నుంచి 20 శాతం దాకా పెరుగుదల కనిపించేది. కరోనా తాకిడికి తొలి సారిగా స్వల్పంగా కోత పెట్టారు. కీలక రంగాలకు కేటాయిం పుల్లో కోత పద్దట్లు కనిపించినా, గతంలో వివిధ ప్రభుత్వ శాఖ ల్లోని కేటాయింపుల్ని ఇప్పుడు సంక్షేమ శాఖలకు మళ్లించారు.

గత ఏడాది రూ.1,78,697 కోట్ల రెవెన్యూ ఆదాయం వస్తుందని లెక్కేస్తే, ఆర్థిక మందగమనంతో రూ.1,10,871 కోట్లు మాత్రమే వచ్చాయి. 2020-21 ఆర్థిక సంవత్సరానికి తొలి మూడు నెలలకు ఓటాన్ అకౌంట్‌లో రూ.70,990 కోట్లు కేటాయించారు. కానీ ఇందులో మూడో వంతు, అంటే 24,000 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టగలిగారు. ఇప్పుడు కరోనా ప్రభావమున్నా, రెవెన్యూ ఆదాయాన్ని రూ.1,61,958 కోట్లుగా లెక్కించారు. మరోవైపు, టార్గెట్‌ను అందుకోవటానికి రూ.62,830 కోట్లు అప్పుల రూపంలోనే సమీకరించాల్సి ఉంటుందని అంచనా వేశారు. సంక్షోభంలో రెవెన్యూ ఆదాయాలు పడిపోతే సంక్షేమ పథకాలను అమలు చేయటానికి అప్పులే సోపానమని అర్థమవుతుంది.

### ఖాతాలకు నేరుగా రూ.37,659 కోట్లు



ఈ బడ్జెట్‌లో నేరుగా లబ్ధిదారులకు అమలయ్యే 18 పథకాలకు రూ.37,659.05 కోట్లు కేటాయించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యాదీవెన, అమ్మ ఒడి, కాపు నేస్తం వంటివి ఇందులో ఉన్నాయి. గత ఏడాది వీటి కేటాయింపులు రూ.24,710.97 కోట్లు మాత్రమే. మొత్తంగా నవరత్నాలకు రూ.43,715 కోట్లు కేటాయించారు. వడ్డీలేని రుణాలకు రూ.1,100 కోట్లు చూపారు. ధరల స్థిరీకరణకు రూ.3,000 కోట్లు, ఆరోగ్యశ్రీ కింద రూ.2,100 కోట్లు, జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ.1,808 కోట్లు ఇచ్చారు. గృహ నిర్మాణానికి వివిధ పథకాల కింద రూ.6,190 కోట్లు కేటాయించారు.

- సాగునీటి ప్రాజెక్టులకు రూ.11,805 కోట్లు కేటాయించారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఈసారి 10 శాతం కోత పడింది. కిందటి సంవత్సరం పెండింగ్ బిల్లులే రూ.5350 కోట్లు ఉన్నట్లు అంచనా.
- బీసీ సంక్షేమ ఉప ప్రణాళికకు రూ.25,331 కోట్లు ప్రకటించారు. వివిధ పథకాల కింద అందించే ప్రయోజనాలన్నీ ఈ విభాగంలోకి తేవటం వల్ల ఉప ప్రణాళిక గతేడాది (రూ.15,061 కోట్లు) కంటే 68 శాతం మేర పెరిగింది. ఎస్.సీ, ఎస్.టీ సంక్షేమ ఉప ప్రణాళికలకు రూ.20,912 కోట్లు.
- మైనారిటీ సంక్షేమానికి రూ.2,050 కోట్లు.
- కాపుల సంక్షేమానికి రూ.2,845.60 కోట్లు. కాపు నేస్తం పథకం కింద ప్రతి కాపు మహిళకు ఏడాదికి రూ.15,000 చొప్పున అయిదేళ్లు ఆర్థికసాయం.
- విద్యారంగానికి రూ.25, 201 కోట్లు
- ఆరోగ్యరంగానికి రూ.11,419 కోట్లు (5.08 శాతం). రాష్ట్రంలో కొత్తగా 15 వైద్య కళాశాలలు, 11,000కు పైగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.
- కొత్త రాజధాని నగరంలో అత్యవసర మౌలిక వసతులకు రూ.500 కోట్లు కేటాయించారు.
- కడప జిల్లా పులివెందుల ప్రాంత అభివృద్ధి ఏజెన్సీకి రూ.100 కోట్లు, కడప యాన్యుటీ ప్రాజెక్టు పనులకు రూ.350 కోట్లు,

కడప ఉక్కు కర్మాగారానికి రూ.250 కోట్లు కేటాయించారు. తొలిసారిగా అమరావతి-అనంతపురం జాతీయ రహదారి నిర్మాణానికి బడ్జెట్లో రూ.100 కోట్లు ప్రతిపాదించారు.

- 2020-21 ఆర్థిక సంవత్సరంలో 700 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి.
- రామాయపట్నంలో రూ.3,736 కోట్ల అంచనాతో 802 ఎకరాల విస్తీర్ణంలో నాలుగు బెర్తులతో ఓడరేవు నిర్మాణం. భావనపాడులో 800 ఎకరాల్లో రూ.3,200 కోట్లతో 3 బెర్తుల పోర్టు నిర్మాణం. 2,203 ఎకరాల్లో భోగాపురం విమానాశ్రయం.

## పెట్టుబడి వ్యయం అంచనాల్లో తగ్గుదల

రాష్ట్రంలో పెట్టుబడి వ్యయం అంచనాల్లో గత ఆర్థిక సంవత్సరం కన్నా తరుగుదల కనిపిస్తోంది. నిరుడు రూ.32,293 కోట్లు ప్రతిపాదించగా, ప్రస్తుతం రూ.29,907.62 కోట్లకు పరిమితం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడి వ్యయం రూపంలో రూ.12,845 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు సవరించిన లెక్కలు చెబుతున్నాయి. రెవెన్యూ ఆదాయాలు రూ.1,61,958 కోట్లుగా చూపారు. ఇందులో కేంద్ర సాయంగా రూ.53,175 కోట్లు వస్తాయని లెక్కించారు. కిందటి ఆర్థిక సంవత్సరంలో కేంద్ర సాయంగా అందింది రూ.21,875 కోట్లే. గత అయిదేళ్లలో ఎప్పుడూ కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో ఆశించిన మొత్తంలో నాలుగో వంతైనా దక్కలేదు. పన్నుల ఆదాయం రూ.70,679 కోట్లు వస్తుందని లెక్కించారు. అంతకుముందు ఏడాది రూ.57,446 కోట్లే వచ్చాయి. మరోవైపు ప్రభుత్వోద్యోగుల జీతాలు, పింఛన్లు, వడ్డీలకే రూ.70,000 కోట్ల వరకూ చెల్లించాలి.

## 29,159.97 కోట్లతో వ్యవసాయ బడ్జెట్

వ్యవసాయ, అనుబంధ శాఖలకు 2020-21 సంవత్సరానికిగాను రూ.29,159.97 కోట్లతో బడ్జెట్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఇందులో ధరల స్థిరీకరణ నిధికి రూ.3,000 కోట్లు, వైఎస్సార్ వడ్డీలేని పంట రుణాలకు రూ.1,100 కోట్లు, ప్రకృతి విపత్తుల సహాయ నిధికి రూ.2,000 కోట్లు, వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి రూ.4,450 కోట్లు, ఉపాధి హామీ కింద వ్యవసాయ, అనుబంధ పనుల కోసం రూ.6,270 కోట్లు, మత్స్యశాఖకు, రూ.299.27 కోట్లు, సహకార శాఖకు రూ.248.38 కోట్లు, పట్టుపరిశ్రమ శాఖకు రూ.92.18 కోట్లు కేటాయింపు ప్రతిపాదనలున్నాయి. ఈసారి వ్యవసాయానికి బడ్జెట్‌లో గతేడాదితో పోలిస్తే రూ.7,000 కోట్ల వరకు (34%) తగ్గించారు. మొత్తం బడ్జెట్ కేటాయింపుల ప్రకారం చూస్తే.. వ్యవసాయ వాటా 6.06 శాతంగా ఉంది. వైఎస్సార్ రైతుభరోసాకు రూ.3,615.60గా చూపించారు. రైతు భరోసా కేంద్రాలకు రూ.100 కోట్లు కేటాయించారు.

## ఒక్కొక్కరిపై రూ.70,362 అప్పు

ఈ ఆర్థిక సంవత్సరాంతానికి రాష్ట్ర అప్పులు రూ.3,48,998 కోట్లకు చేరవచ్చని అంచనా. 2011 జనాభా ప్రకారం 4.96 కోట్ల మంది ఉన్నారు. అంటే, ఒక్కొక్కరిపై రూ.70,362 అప్పు తేలుతుంది. గత ఆర్థిక సంవత్సరం చివరికి రూ.2,91,345 కోట్లకు రుణభారం పెరుగుతుందని బడ్జెట్ సమయంలో సర్కారు అంచనా వేసింది. అందుకు భిన్నంగా అది రూ.3,02,202.70 కోట్లకు చేరుకుంది. 2019-20లో మొత్తం రూ.44,692.83 కోట్ల రుణం తీసుకున్నారు. జీఎస్‌డీపీలో రుణాల వాటా 34.55 శాతానికి పెరిగింది. 2019-20లో విద్యుత్ రంగంలో రుణాలకు రూ.13,901.60 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం హామీలిచ్చినట్లు వెల్లడించారు. ఇతరత్రా రూ.53,269.88 కోట్లకు ప్రభుత్వం పూచీకత్తు ఇచ్చినట్లు పేర్కొంటూ మొత్తం రుణం రూ.67,171.48 కోట్లుగా చూపారు. రాష్ట్ర మొత్తం రెవెన్యూ వసూళ్లలో ఇది 60.49 శాతంగా ఉన్నట్లు బడ్జెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

**బడ్జెట్ స్వరూపం (రూ. కోట్లలో)**

| ఆర్థిక సంవత్సరం | ప్రతిపాదిత బడ్జెట్ | రెవెన్యూ ఆదాయం | రెవెన్యూ ఖర్చు |
|---|---|---|---|
| 2015-16 | 1,13,048.98 | 88,647.80 | 95,949.66 |
| 2016-17 | 1,35,688.90 | 98,984.48 | 1,16,178.21 |
| 2017-18 | 1,56,999.39 | 1,05,062.09 | 1,21,213.77 |
| 2018-19 | 1,91,063.60 | 1,14,684.14 | 1,26,339.05 |
| 2019-20 | 2,27,975.00 | 1,78,697.41 | 1,80,475.94 |
| 2020-21 | 2,24,789.18 | 1,61,958.50 | 1,80,392.64 |

## (మీడియాలో) 'కీ' కామెంట్లు!

దేశంలో 30 శాతం రైతులకు మాత్రమే పంటలకు కనీస మద్దతు ధరల గురించి అవగాహన ఉంది. వారిలోనూ 30 శాతమే ప్రభుత్వ ధాన్యసేకరణ కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్మి లబ్ధి పొందుతున్నారు. కనీస మద్దతు ధరల పథకం కింద ప్రభుత్వం సేకరించే పంటల ఉత్పత్తిలో 80 శాతం వరి, గోధుమలే ఉంటాయి. కొంతమేర చెరకూ ఉంటోంది. వీటిలో 50 శాతం వరి, 75 శాతం గోధుమ పంటల ఉత్పత్తిని కేవలం మూడు రాష్ట్రాలు– పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌ల నుంచే సేకరిస్తున్నారు. కనీస మద్దతు ధరల కింద ధాన్య సేకరణను వికేంద్రీకరించినా అది క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదు. తెలుగు రాష్ట్రాల నుంచి వరినే ఎక్కువగా సేకరించి మిగతా పంటలను అంతగా పట్టించుకోవడం లేదు. దీన్ని బట్టి దేశంలో కనీస మద్దతు ధర విధానం కొన్ని పంటలకు, కొన్ని రాష్ట్రాలకు మాత్రమే మేలు చేసేదిగా ఉంటోంది. మరోవైపు, ప్రభుత్వం ప్రకటించే పంటల మద్దతు ధరలు వాస్తవమైన పంట ఉత్పత్తి వ్యయాల్ని ప్రతిబింబించడం లేదు. ఒక పంట ఉత్పత్తి వ్యయంలో రాష్ట్రాల మధ్య అంతరం ఎక్కువగా ఉన్నా, దేశం మొత్తం ఒకే రకమైన మద్దతు ధర ప్రకటించడం వల్ల ఉత్పత్తి ఖర్చు అధికంగా ఉండే రాష్ట్రాల్లోని రైతులు నష్టపోతున్నారు.

**- డాక్టర్ చీరాల శంకర్‌రావు, ఆర్థికరంగ నిపుణులు**

**రైతులను కోటీశ్వరులు చేస్తానని చెప్పటం లేదు. వారి అప్పు తీరి.. మూడునాలుగు లక్షలు బ్యాంకులో ఉండాలనేది నా తపన.**

**- కె.చంద్రశేఖరరావు, తెలంగాణ ముఖ్యమంత్రి**

ప్రభుత్వాలు పేద, మధ్యతరగతికి ప్రధాన ఇబ్బందులు కలిగించే విద్య, వైద్యం మీద ఎంత దృష్టి పెడితే, అంతగా పేదరికాన్ని తగ్గించి, మధ్యతరగతిని పెంచవచ్చు. అంతిమంగా భారతదేశాన్ని 2050 నాటికి ప్రపంచంలో అత్యంత ఎక్కువ జీడీపీ ఉన్న దేశంగా తీర్చిదిద్దవచ్చు. కుల, మత, వర్గరహిత సమతుల్య ఆర్థిక అభివృద్ధి, పరిశోధన రంగం బలోపేతం, పని సంస్కృతి, అవినీతిరహిత సమాజ నిర్మాణం, పరిపాలన సరళీకరణ, న్యాయవ్యవస్థల బలోపేతం ద్వారా 2050 వరకు మేరా భారత్‌ను మహాన్‌గా ఆవిష్కరించవచ్చు.

**- డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎంపీ**

తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించిన షీ టీమ్స్ విజయవంతమయ్యాయి. భరోసా కేంద్రాలు, విమెన్ సేఫ్టీ వింగ్ మహిళల భద్రతకు అండగా నిలుస్తున్నాయి. సత్వర న్యాయం అందించటం, ఉన్నత న్యాయస్థానాలపై భారం తగ్గించటం కోసం గ్రామన్యాయాలయాల చట్టం–2008 అమలు విషయంలో తెలంగాణ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ చట్టం ప్రకారం రాష్ట్రంలో గ్రామీణ న్యాయాలయాలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మండల స్థాయిలో 55 గ్రామీణ న్యాయాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. జూనియర్ సివిల్ జడ్జి స్థాయి న్యాయాధికారులు గ్రామీణ న్యాయాలయాల్లో న్యాయమూర్తులుగా వ్యవహరిస్తారు. ఈ న్యాయాలయాల నిర్వహణకు కావాల్సిన సిబ్బంది నియామకానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గ్రామీణ న్యాయాలయాల ఏర్పాటుతో తాలూకా, జిల్లా స్థాయి కోర్టులపై భారం తగ్గి కేసుల సత్వర పరిష్కారానికి ఆస్కారం ఏర్పడుతుంది.

**- విక్రమ్ బాలసాని**

కార్మికుల పోరాటాలు విజయవంతమవ్వాలంటే శ్రామిక ఉత్పాదకత పెరిగితీరాలి. ఉదాహరణకు ఒక చక్కెర ఫ్యాక్టరీ యజమాని తమకు అవసరమైన సంచుల్ని చేతితో కుట్టాలా లేక యంత్రాలతో కుట్టించాలా అనే విషయమై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒక కార్మికుడు గంటకు 20 బస్తాల చొప్పున కుట్టగలిగితే యజమానికి అది లాభదాయకమవుతుంది. అలా కాకుండా ఒక కార్మికుడు ఒక గంటకు కేవలం పది బస్తాలను మాత్రమే కుట్టగలిగితే యజమాని నష్టపోయే అవకాశమున్నది. కనుక పారిశ్రామికవేత్తలు కార్మికులు మరింత ఎక్కువ సంఖ్యలో నియోగించుకునేలా చేయాలంటే శ్రామిక ఉత్పాదకతను గణనీయంగా పెంపొందించవలసి ఉన్నది. ఈ కోణం నుంచి పారిశ్రామిక వివాదాల చట్టంపై పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. పనిలో సమర్థత చూపని కార్మికుల్ని తొలగించటాన్ని కష్టసాధ్యం చేస్తోంది చట్టం.

**- భరత్ ఝున్‌ఝున్‌వాలా, ఆర్థికవేత్త**

కరోనా వైరస్ విధ్వంసం శిథిలాల నుంచి లేచి నిలబడాలని చూస్తున్న అమెరికా, బ్రిటన్ దేశాల్లో సరికొత్త జాతీయ గుర్తింపునకు సంబంధించి మరింత లోతుగా, దృఢంగా సాగుతున్న సమరం ఇప్పుడే ప్రారంభమైంది. జాతివివక్షానంతర, సామ్రాజ్యవాద అనంతర గుర్తింపు కోసం ప్రస్తుతం శోధిస్తున్న అమెరికా, బ్రిటన్ దేశాలు.. రెండు ప్రపంచ యుద్ధాల్లో తమకు రాజీపడని శత్రువుగా నిలిచిన జర్మనీ నుంచి తెలివైన పాఠాలు నేర్చుకోవలసి ఉంది. గతంలో జాత్యహంకారానికి మారుపేరుగా నిలిచిన జర్మనీ పది లక్షల మందికి పైగా వలస కార్మికులకు స్వాగతం పలుకుతూ కొత్త సంస్కృతికి తలుపులు తెరిచింది. ఇదే పరిణామాన్ని సుసాన్ నీమన్ సకాలంలో రాసిన 'లెర్నింగ్ ఫ్రమ్ ది జర్మన్స్' పుస్తకం.. రెండో ప్రపంచయుద్ధానంతరం జర్మనీలో తలెత్తిన అతి పెద్ద, విస్తృత సామాజిక ఉద్యమంగా వర్ణించింది. ఇటీవలి సంవత్సరాల్లో ఆంగ్లో-అమెరికాను ధ్వంసం చేసిన విషపూరిత రాజకీయాల నుంచి పూర్తిగా బయటపడే ప్రక్రియలో జర్మనీ అత్యున్నత స్థాయికి చేరుకుంది. అయితే ఇది ఒక్కరాత్రిలో సంభవించింది కాదు. అమెరికా దక్షిణ ప్రాంతంలో పూర్తిగా విడిపోయిన జాతుల మధ్య పెరిగిన తత్వవేత్త నీమన్, చాలాకాలం బెర్లిన్‌లో నివసిస్తూ, ఒక గొప్ప వ్యాఖ్య చేశాడు. "చరిత్రలో అత్యంత దారుణమైన నేరాలకు పాల్పడినవారు తమ నేరాలను అంగీకరించడానికి దశాబ్దాల కఠిన కృషి అవసరమైంది. ఆ తర్వాతే వారు తమ నేరాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవడం మొదలుపెట్టారు." జాతివివక్ష, జాతీయ, సామ్రాజ్యవాద భ్రమల్లో మునిగితేలుతున్నవారు తమ సమాజం సుదూర గతంలో చేసిన తప్పులను అంగీకరించడం అంటే అది తమ బలహీనతే అని నిస్సందేహంగా భావిస్తారు. అయితే అదే సమయంలో అవమానకరమైన గత చరిత్రతో ఘర్షించి కొత్తమార్గం చేపట్టడం అనేది ఏ జాతికైనా, సమాజానికైనా అతి గొప్ప బలానికి చెందిన వనరుగానే ఉంటుంది.

**- పంకజ్ మిశ్రా, రచయిత, కాలమిస్ట్**

మాట్లాడే స్వేచ్ఛలేని, దోపిడీకి గురవుతున్న కోట్లాదిమంది నిమ్నకులాల కోసం అంబేద్కర్ పాత్రికేయునిగా కూడా అవతరించారు. కొల్హాపూర్ మహారాజా ఆర్థిక సహకారంతో ఆయన ప్రారంభించిన 'మూక్‌నాయక్' పక్ష పత్రికఈ ఏడాది శతవసంతాల మైలురాయిని దాటింది. నిమ్నకులాల పోరాటాలు, అంబేద్కర్ చేసిన ప్రసంగాలు, రచనల్ని ఈ పత్రిక ప్రచురించేది. విషయం పట్ల అవగాహనతో, ఆధారాలతో, పాఠకులు వాస్తవాలను గ్రహించి, అంగీకరించే రీతిలో 'మూక్‌నాయక్' పత్రికను ఆయన నిర్వహించారు. అంటరానితనం నిర్మూలన, సంఘసంస్కరణ మీద జరుగుతున్న చర్చలు, వాదప్రతివాదాలు ఈ పత్రికలో ప్రచురించేవారు. డాక్టర్ అంబేద్కర్ చొరవతో ఆవిర్భవించిన 'మూక్‌నాయక్', 'బహిష్కృత్ భారత్', 'సమత', 'జనత' పత్రికలు నిమ్నకులాల ఆత్మగౌరవ, హక్కుల ఉద్యమానికి వాహికగా నిలిచాయి. అంబేద్కర్ తన పత్రికల ద్వారా కోట్లాదిమంది అంటరాని ప్రజానీకంలో కొంతమేర సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు తీసుకొచ్చారు. నిమ్నకులాలకు పత్రికా రచన వారసత్వాన్ని తీసుకొచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో పత్రికాస్వేచ్ఛకు భావవ్యక్తీకరణ హక్కు రూపంలో అధిక ప్రాధాన్యతనిచ్చారు. నిర్మాణాత్మక తప్పిదాలపై ఉద్యమించి ఫలితాలు సాధించిన వ్యక్తిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను ఈ దేశం సుదీర్ఘకాలం గుర్తుంచుకోవలసి ఉంటుందని నాటి పత్రికారంగం ఆయన సేవలను కొనియాడింది.

**- డా॥ జి.కె.డి ప్రసాద్, ఫ్యాకల్టీ,**
**ఏయూ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం**

ఆరోగ్య సంరక్షణపై పెట్టుబడులు పెట్టాల్సిన అవసరాన్ని కరోనా మనకు నొక్కి చెబుతోంది. ఆరోగ్య సంరక్షణ అనేది మూలధనం అవసరమయ్యే రంగం. ఉద్యోగాలను ఇచ్చే రంగం కూడా. ఇప్పుడు ఆరోగ్య మౌలిక వసతుల్లో పెట్టుబడులు పెట్టటానికి ఒక అవకాశం కలిగింది. అదే భారత్‌ను, ప్రపంచాన్ని కాపాడుతుంది.

**కిరణ్ మజుందార్ షా, బయోకాన్**
**ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్**

తూర్పు లద్దాఖ్‌లో చైనా, భారత్ సైనిక దళాల మధ్య హింసాత్మక ఘర్షణలు మోదీ బ్రాండ్ దౌత్య శైలి పరిమితులను స్పష్టంగా ఎత్తిచూపాయి. స్వీయ ప్రాధాన్యాన్ని పెంపొందించుకునేందుకు వ్యవస్థాగత పద్ధతులను వదిలేసి పూర్తిగా వైయక్తిక రీతిలో దౌత్యాన్ని నెరపడం హితకరం కాదని స్పష్టమయింది.

**రాజ్‌దీప్ సర్దేశాయ్, సీనియర్ జర్నలిస్టు**

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, సోషల్ మీడియా)

- సత్య, ట్యాక్స్‌పేయర్స్ అసోసియేషన్,
ఫోన్: 99124 15128

# అలాంటి ఉచితాల్ని పందేరం చేసేవారు


# గొప్ప నాయకులా?.. గుమాస్తాలా?

**-'ఫ్రీ బీ'ల కట్టడికి ఎఫ్ఆర్‌బీఎం తరహా చట్టం తేవాలి-**

మన దేశంలోని ఎలక్షన్ కింగ్ నేతల పాలన నుంచి తరచూ వినిపించే పదం 'ప్రజల కోసం ఉచిత పథకం'. ప్రజలకు ఎన్ని ఉచితాల్ని ఇవ్వగలిగితే అంత గొప్పనాయకులమని, ఎన్నికల్లో గెలుపునకు అంత అర్హులమని చాటుకుంటుంటారు. కానీ ఫ్యాక్ట్‌చెకర్‌లో పెట్టి చూస్తే అదో పెద్ద బ్లఫ్ అని తేలుతుంది.

ఉచితంగా ఇవ్వటం అంటే.. మన సొంత సంపద నుంచి ప్రతిఫలం ఆశించకుండా ఎవరికైనా ఇచ్చేది. ఉదాహరణకు, మనం వ్యక్తిగతంగా కష్టపడి సంపాదించిన డబ్బుతో ఎవరైనా పేద విద్యార్థిని చదివిస్తే అది ఉచితం. దాన్ని గురించి మనం వ్యక్తిగతంగా డబ్బా కొట్టుకోవాల్సిన తీసుకోవటమనేది పక్కా మోసపూరిత ప్రచారం. అలాంటి పథకాలు తమ నాయకత్వ పాటవానికి పెద్ద నిదర్శనమని చాటుకోవటం హాస్యాస్పదం కూడా.

వాస్తవానికి, ఓ పథకం రూపంలోనో, మరే రూపంలోనో ప్రజల సొమ్మును తిరిగివ్వటం సాంకేతికంగా మాత్రమే ఉచితం అవుతుంది. కాకపోతే రుసుములు వంటి ఆర్థిక భారం, నిబంధనలు లేకుండా నేరుగా ఆ డబ్బునివ్వటం మేర రాజకీయ విధాన ప్రభావముంటుంది. సమర్థత, తెలివితేటలు, ముందు చూపు ఉన్న నాయకులైతే తమ రాజకీయ ఆలోచనకు పదునుపెట్టి ఉత్పాదకత చుట్టూ తిప్పుతారు. ప్రజల పన్నుల సొమ్ముకు 10 రెట్లు




అవసరం లేకపోయినా.. ఇతరులకు స్ఫూర్తినిస్తుందనే ఉద్దేశంతోనూ, కృతజ్ఞత చూపాల్సిన బాధ్యతతోనూ ఆ ఉచితంలోని వదాన్యతను సమాజం వీలున్నప్పుడల్లా ప్రస్తావిస్తుండాలి.

అలాగే కరోనా కఠిన లాక్‌డౌన్ సమయంలో మనలోని పలువురు వ్యక్తిగతంగా, సంస్థల ద్వారానూ పేదలకు, వలస కూలీలకు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా భోజనాది సదుపాయాలు సమకూర్చారు. ఈ ఉచితాలు కూడా ప్రస్తుతనీయం.

కానీ, ప్రజల దగ్గర వసూలు చేసిన పన్నుల డబ్బుల్ని బేషరతుగా ఆ ప్రజలకే తిరిగి ఇవ్వటాన్ని తమ సొంత సొమ్ము దానం చేసినట్లు ప్రభుత్వాధినేతలు ఎలా చెప్పుకుంటారు? ఇలాంటి ఉచిత పథకాలకు క్రెడిట్ లాభం కలిగే పథకాల్ని ప్రవేశపెడతారు.

అలాంటి ఉత్పాదకత ఉంటే ఉచితాల పథకాల్లోనైనా నాయకులకు ఘనతను ఆపాదించవచ్చు. ప్రభుత్వాలు చేయాల్సిన పనులన్నీ సక్రమంగా చేస్తూ ఉచితాలనిచ్చినా కూడా చూసీచూడనట్లు వదిలేయొచ్చు (ఏ పనీ చేసుకోలేని నిస్సహాయులకజీవితావసరాలకు ఉచితంగా పంపిణీ చేయటాన్ని ఎలాగూ తప్పుపట్టం). కానీ ప్రభుత్వాలుగా తమ మౌలిక బాధ్యతల్ని సవ్యంగా చేయకుండా, ఉత్పాదకత, సమానావకాశాల అభివృద్ధి ఊసు లేకుండా.. వట్టి ఉచితాల చుట్టూ గుర్తింపు పొందాలనుకునేవారు మాత్రం ఉత్సవ విగ్రహాలే తప్ప అసలైన నాయకులు కారు.

తెలుగు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉచితాల్లో కూడా అలాంటి పథకాలు దాదాపుగా లేవు. ఉచితమా, కాదా

# తీపి పరీక్ష!

దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం స్వీయనియంత్రణ శక్తి పిల్లల్లో ఎంత ఉంటుంది?.. తెలుసుకోవటానికి స్టాన్‌ఫర్డ్ పరిశోధకుడు వాల్టర్ మిషేల్ చేసిన పరిశోధన ఎంతో సుప్రసిద్ధమైనది. అయితే దీన్ని గురించి తెలిసిన పెద్దలు కూడా తరచూ మర్చిపోతుంటారు కాబట్టి.. ఇక్కడ మరోసారి గుర్తుచేస్తున్నాం. 'మార్ష్‌మాలో (ఒకరకమైన తీపి తినుబండారం) టెస్ట్'గా పేరొందిన ఈ పరీక్షలో భాగంగా బింగ్ నర్సరీ స్కూల్‌లో పిల్లలను ఒక గదిలో కూర్చోబెట్టి వారి ముందు సదరు స్వీట్‌ను ఉంచారు. మీరు గనక 20 నిముషాల పాటు దాన్ని తినకుండా కంట్రోల్ చేసుకోగలిగితే, మరో స్వీట్‌ను ఇస్తామన్నారు. అంటే, స్వీయనియంత్రణ పాటిస్తే రెట్టింపు స్వీట్ దక్కుతుందన్నమాట. పిల్లల్ని గదిలో వదిలేసి, వారికి తెలియకుండా బైట నుంచి అద్దాల ద్వారా గమనించటం మొదలుపెట్టారు. కొందరు పిల్లలు రాబోయే స్వీట్ గురించి ఏమాత్రం ఆలోచించకుండా తమ ఎదురుగా ఉన్న స్వీట్‌ని వెంటనే తినేశారు. ఇంకొందరు స్వీట్ వంక చూడకుండా ఉండటానికి రకరకాలుగా తంటాలు పడ్డారు. అటూఇటూ దిక్కులు చూస్తూ సమయం గడపటానికి ప్రయత్నించారు. కానీ కొన్ని నిముషాల తర్వాత ఆగలేక తినేశారు. కొంతమంది మాత్రం ఇరవై నిముషాల పాటూ ఆగగలిగారు.. కొన్నేళ్ల తర్వాత ఈ రిపోర్టు నుంచి ఊహించని ఆసక్తికరమైన విషయాలు వెలువడ్డాయి. మార్ష్‌మాలో టెస్ట్‌లో పాల్గొన్న పిల్లల్లో వాల్టర్ మిషేల్ కూతుళ్లు కూడా ఉన్నారు. వారు తర్వాత స్టాన్‌ఫర్డ్‌లో చదువుకున్నారు. దీంతో, మిగిలిన పిల్లలు ఏం చేస్తున్నారు? అనే ఉత్సుకత కలిగి పరిశీలించారు. 'చిన్నప్పుడు స్వీయనియంత్రణ పరీక్షలో వారు ఎలా వ్యవహరించారు? ఇప్పుడేం చేస్తున్నారు? రాబోయే పదేళ్ల కాలంలో వారేం చేస్తారు?'.. ఇలా దాదాపు మూడు దశాబ్దాలకుపైగా వారిని నిశితంగా గమనించారు. చాలా విలువైన సమాచారం వెల్లడైంది. ఏమాత్రం స్వీయనియంత్రణ లేకుండా, రెండో స్వీట్ వస్తుందన్న ఆలోచన లేకుండా వెంటనే స్వీట్‌ను తిన్న పిల్లలకన్నా.. కొద్దిసేపు నియంత్రణ పాటించిన పిల్లలు చదువులో, కెరీర్‌లో బాగా రాణించారు. దీర్ఘకాలిక ప్రయోజనం కోసం పూర్తిస్థాయిలో స్వీయనియంత్రణ పాటించినవారు బ్రహ్మాండంగా రాణించారు. స్వీయనియంత్రణ గల పిల్లల్లో.. చదువు, ఆదాయం, ఇతరులతో సంబంధాలు గణనీయంగా ఉన్నతస్థాయిలో ఉన్నాయి. మద్యం, డ్రగ్స్ వంటి అలవాట్లు లేవు. ఆరోగ్య సమస్యలు చాలా తక్కువ. ఎక్కువ ఫిట్‌నెస్‌తో ఉన్నారు. జాతీయ పోటీ పరీక్షలో 210 పాయింట్లను అదనంగా సాధించారు. స్వీయనియంత్రణ ఏమాత్రం లేని పిల్లల్లో 40 శాతం మందిపై నేరచరిత్ర నమోదైంది. ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవటంలో వెనుకబడ్డారు. బ్యాంక్ బ్యాలెన్స్ అరకొర. మద్యం, మత్తుపదార్థాలకు అలవాటు పడ్డవారు వీరిలో ఎక్కువగా ఉన్నారు.. మనిషి 'స్వీయనియంత్రణ శక్తికి – సక్సెస్‌కి – దీర్ఘకాలిక ప్రయోజనాలకు' మధ్య సంబంధం ఇంత స్పష్టంగా కనిపిస్తుండగా.. తాత్కాలిక తాయిలాల చుట్టూ ప్రజల్ని ప్రలోభపెట్టి, వాటికి కులం, మతం, ప్రాంతం వంటి ఆటవిక ఉద్వేగాలను జోడించి, వివశుల్ని చేసి, వారి ఓట్లను కొల్లగొట్టి, తాము కడుతున్న పన్నుల డబ్బుకి – తమ జీవితాలకు సంబంధమేంటో వారికి అర్థంకాకుండా విపరీత కేంద్రీకృత పాలన చేస్తూ జనం అభివృద్ధిని, భవిష్యత్తును దెబ్బతీస్తున్న రాజకీయులను గొప్ప నాయకులని ఏరకంగా అనగలం?

అనే తప్పు.. ఉత్పాదకమా, అనుత్పాదకమా? అనే చర్చే కొరవడింది. నగదు బదిలీ రూపంలో ఇచ్చే పథకాల్లో కొన్ని మౌలికంగా సరైనవే అయినప్పటికీ, వాటిని సైతం అనుత్పాదక రీతిలో పందేరం చేస్తుండటంతో ఈ పాలకులకు వాటిల్లో కీర్తిని అందించటం కూడా అనుచితమే అనిపించుకుంటుంది.

ఉచిత పథకాలతో డొల్లనాయకత్వాన్ని ప్రదర్శిం చటంతోపాటు. తెలుగునాట పాలకులు చాలా ప్రభుత్వ పథకాలకు వారి పేర్లను, కుటుంబసభ్యుల పేర్లను పెట్టు కొంటున్నారు. ఉదాహరణకు ఏపీలో గతంలో చంద్రన్న బీమా, సంక్రాంతికి చంద్రన్న కానుక, ఇప్పుడు 'జగనన్న చేదోడు'. ఇలా ప్రజల పన్నుల సొమ్ముతో పాలకులు ప్రచారాలు చేసుకుం టున్నారు, నిజానిజాలతో సంబంధం లేకుండా ఏదోకరకంగా మభ్యపెట్టయినా కీర్తికిరీటాలను ధరించాలని ఆరాటపడుతున్నారు. ఇలా కేవలం ప్రజల సొమ్ములను ప్రజలకు అనుత్పాదకంగా పంచడానికి, అది కూడా యాచక ప్రవృత్తిని పెంచే రీతిలో పంచడానికి.. కోట్ల రూపాయలతో ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ద్వారా ప్రభుత్వాలు ఏర్పాటు, వీళ్లకు లక్షల్లో జీతాలు, సకల సౌకర్యాలు, విలాసాలు, విందులు అవసరమా? పనిచేత గాని గుమస్తాలు కూడా చేయగలరు అలాంటి పాలన.

లోక్‌సత్తా జేపీ చొరవతో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఆధ్వర్యంలో జనవరిలో జరిగిన 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' తొలి సదస్సు వెలువరించిన 'హైదరాబాద్ డిక్లరేషన్' విజ్ఞప్తి చేసినట్లు.. ధనరాజకీయాల స్థానంలో జనరాజకీయాల్ని తీసుకురావటానికి మనం 'ఫ్రీ బీ'ల కట్టడిపైనా దృష్టి సారించాల్సి ఉంది. రాష్ట్రాల్లో ఏడాపెడా పార్టీలు ఇస్తున్న ఉచితాల హామీలను నియంత్రించేందుకు ఎఫ్ఆర్‌బీఎం తరహాలో చట్టం తీసుకురావాల్సి ఉంది. బడ్జెట్‌లో ఎంత మేర హామీల వ్యయం ఉండాలో స్పష్టమైన గీత గీయాలి. పాలన దివాలా తీయకుండా ఆర్థిక పరిస్థితికి తగ్గట్లుగా హామీలు ఉండేలా చేయాలి. పార్టీల, వ్యక్తిగత ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రజాదరణ పొందిన పథకాల రూపంలో ప్రభుత్వాలు అందించే స్వల్పకాలిక ప్రయోజనాలు పేదలు, మధ్యతరగతి ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. 70 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా 20-40 శాతం మంది పేదరికంలో ఉండగా, 80 శాతం మందికి సరైన చదువు, ఆరోగ్యం అందటం లేదు. పనికిమాలిన ఫ్రీ బీలకు కళ్లెం వేసే ఇలాంటి చట్టం ఇప్పటికే ఉండుంటే, కొవిడ్ ప్యాండమిక్ వల్ల ఉపాధి దెబ్బతిన్న కోట్లాదిమంది సామాన్య, మధ్యతరగతికి ఉదారంగా గణనీయమొత్తంలో ఆర్థిక సాయం అందించటానికి కూడా మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తడుముకోవాల్సి వచ్చేది కాదు. నగదు నిల్వలు అందుబాటులో ఉండుండేవి.

తక్షణ అవసరాలు - దీర్ఘకాలిక ప్రయోజనాల మధ్య సహేతుక సమతుల్యత ఇప్పుడు అత్యవసరం. ఉచిత పథకాలు వంటి రూపంలో మన సొమ్మును అనుత్పాదకంగా దుర్వినియోగం చేస్తూ కూడా గొప్ప నాయకులుగా చెలామణి కావాలనుకుంటున్న రాజకీయుల తీరుపై ట్యాక్స్‌పేయర్స్‌గా ప్రజలే ఆలోచించాలి. కరోనా సంక్షోభాన్ని అవకాశంగా మలచుకునే క్రమంలో మన దేశంలోని సంక్షేమ వ్యవస్థను కూడా పునర్నిర్మించాలన్న జేపీ ప్రతిపాదనపై గట్టిగా దృష్టి సారించాలి.





# బ్యూరోక్రాట్లు - రాజకీయ నాయకులు

"సివిల్ సర్వెంట్లు విధినిర్వహణలో ఉన్నప్పుడు
రాజకీయ తటస్థతను ప్రదర్శించాలిగానీ, నైతిక తటస్థతను కాదు.

"ఉన్నతాధికారుల్ని నియంత్రించటం కంటే
రాజకీయ నాయకుల్ని నియంత్రించటం తేలిక.

"నాయకత్వం అంటే కేవలం పార్లమెంటు సీట్లు గెలవటం కాదు.
తన రాజకీయ ప్రభావాన్ని జవాబుదారీతనంగల దీర్ఘకాల సుస్థిర సంస్కరణల కోసం వెచ్చించే
సామర్థ్యాన్ని ప్రదర్శించటం నాయకత్వానికి అసలైన కొలమానం"

- 'విజన్ ఇండియా ఫౌండేషన్' ఆన్‌లైన్‌లో నిర్వహించిన పాలసీ శిక్షణా కార్యక్రమం (ఈ-పీబీసీ)లో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్! 'ఉన్నతాధికార వ్యవస్థలో మరింత జవాబుదారీతనం తేవటానికి సంస్కరణల'పై ఇందులో జేపీ దిశానిర్దేశం చేశారు.

Policy BootCamp
ePBC
Deepening Democracy and Gearing - up Governance
VIF's Online BootCamp on Public Policy

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th July, 2020 Posting Date 15 &16th of every month




**BOOK POST**

**PRINT MATTER**

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC “X” Roads, Hyderabad 500 020